ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
శనివారం 19 జూలై 2025



ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 25.0



కొయ్యలగూడెంలో టీడీపీ నాయకులతో సమావేశమైన రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం

నేడు మంత్రి సంధ్యారాణి కొయ్యలగూడెం రాక

- మంత్రి పర్యటన విజయవంతం చేయండి : ట్రైకార్ చైర్మన్ బొరగం

కొయ్యలగూడెం, జూలై 18(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి శనివారం కొయ్యలగూడెంలో పర్యటించనున్నారు. ఈ మేరకు ఆమె తారకరామనగర్ ఏరియాలో జరిగే తొలి అడుగు, ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో పాల్గొం టారు. కాగా రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ కొయ్యలగూడెం టీడీపీ నాయకులతో శుక్రవారం సమావేశమై మంత్రి పర్యటన విజయవంతం చేయా లని కోరారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్య కర్తలు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పారేపల్లి రామారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు జ్యేష్ట రామకృష్ణ, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొబ్బర చినరాజు, తెలుగు మహిళా నాయ కురాలు ఆకుల అరుణ, ముదునూరి రామకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

21న పోస్టాఫీసుల్లో వినియోగదారుల సేవలు నిలిపివేత

ఏలూరు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి):విని యోగదారులకు మెరుగైన సేవలను అందించేందుకు తపాలా శాఖ ప్రారంభించనున్న నెక్స్ జనరేషన్ ఏపీటీ అప్లికేషన్ వ్యవస్థను ఏలూరు డివిజన్‌లోని అన్ని పోస్టాఫీసుల్లో ఈనెల 22 నుంచి అమలు చేయ నున్నట్టు పోస్టాఫీసుల సూపరింటెండెంట్ ఎస్.శ్రీకర్ బాబు తెలిపారు. ఈ ఆధునిక డిజిటల్ ప్లాట్‌ఫాంకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను అనుసంధానం చేసేందుకు వీలుగా ఈనెల 21న అన్ని పోస్టాఫీసుల్లో వినియోగదారులకు సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు వెల్లడించా రు. పోస్టాఫీసు పనులను, లావాదేవీలను వినియోగ దారులు ముందుగానే ప్లాన్ చేసుకుని సహకరిం చాలని కోరారు.

ఐటీఐల్లో రేపటితో ముగియనున్న అడ్మిషన్ దరఖాస్తుల గడువు

ఏలూరు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 20వ తేదీ సాయంత్రం 5 గంటలతో ముగుస్తుందని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, అడ్మిషన్ల కన్వీనర్ డి.భూషణం తెలిపారు. అడ్మిషన్ల కౌన్సెలింగ్ ప్రభుత్వ ఐటీఐలకు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు, ప్రైవేటు ఐటీఐలలో 26, 27 తేదీల్లో జరుగుతుందన్నారు. వివరాలకు 08812-230269లో సంప్రదించాలన్నారు.



దాకరం పాఠశాలలో విచారణ నిర్వహిస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ పంకజ్‌కుమార్

దాకరం యూపీ స్కూలు స్థాయి తగ్గింపు.. ఏపీసీ విచారణ

ముదినేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి):పాఠశాల పునర్వ్యవస్థీకరణలో భాగంగా దాకరం యూపీ పాఠశాల స్థాయి తగ్గించి బేసిక్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయడంపై జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ పంకజ్‌కుమార్ శుక్రవారం విచారణ నిర్వహించారు. పాఠశాల స్థాయి తగ్గింపుతో 6,7,8 తరగతులు చదివేందుకు సుదూరంలోని ముదినేపల్లి హైస్కూలుకు వెళ్లేందుకు విద్యార్థులు ఎదుర్కొనే ఇబ్బందులపై పత్రికల్లో వచ్చిన కథనాలు, ఎస్ఎంసీ కమిటీ తీర్మానాలను కలెక్టర్ వెట్రిసెల్వి పరిగణలోకి తీసుకున్నారు. ఆమె ఆదేశాల మేరకు దీనిపై డీఈవో వెంకటలక్ష్మమ్మ ఏపీసీతో విచారణ జరిపించారు. పాఠశాల స్థాయి తగ్గించడం వల్ల 45 మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూ ముదినేపల్లి హైస్కూలుకు వెళ్లాల్సి వస్తుందని సర్పంచ్ జాస్తి రాజా, ఎస్ఎంసీ చైర్మన్ రేవతి, సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. యూపీ స్కూల్‌ను కొనసాగించాలని కోరారు. దీనిపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని ఏపీసీ తెలిపారు. ఎంఈవో -1 రామారావు, ఎంఈవో-2 నరేష్‌కుమార్, హెచ్ఎం దినేష్‌బాబు పాల్గొన్నారు.

మళ్లీ కురుస్తున్న వర్షాలు

ఏలూరు సిటీ, జూలై 18(ఆంధ్రజ్యోతి):జిల్లాలో మళ్లీ వర్షాలు కురుస్తున్నాయి. అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా బుట్టాయిగూడెం మండలంలో 73 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 18.1 మి.మీగా నమోదైంది. జిల్లాలో శుక్రవారం పలు చోట్ల వర్షాలు కురిశాయి. కలిదిండి 65.4, జీలుగుమిల్లి 60.8, కైకలూరు 59.6, జంగారెడ్డిగూడెం 59.6, కొయ్యలగూడెం 36.4, చింతలపూడి 35.2, మండవల్లి 26.4, చాట్రాయి 20.4, టి.నరసాపురం 19, పెదపాడు 17.4, నూజివీడు 9.6, కుక్కునూరు 5.4, ముదినేపల్లి 4.6, ద్వారకాతిరుమల 4, ఉంగుటూరులో 3, పోలవరం 2.6, ఏలూరు అర్బన్ 2, ఆగిరిపల్లి 1.2, వేలేరుపాడు 1, కామవరపుకోట 0.8, ఏలూరు రూరల్ 0.4 మి.మీ వర్షపాతాలు నమోద య్యాయి. వర్షాల రాకతో సార్వా వరి సాగు పనులలో రైతులు నిమగ్నమయ్యారు.

కమిషనర్ మందలించారని..

- పారిశుధ్య కార్మిక దంపతుల ఆత్మహత్యాయత్నం

■ లోపలి పేజీలో..




తుమ్మూరు వద్ద అధ్వానంగా ఉన్న ఆంధ్రా కాలువ గేట్లు

చింతలపూడి మండల రైతులకు విభజన కష్టం

ఎవరికీ పట్టని.. ఆంధ్రా కాలువ!

సాగునీటికి అన్ని అవకాశాలు ఉన్నా అధి కారుల నిర్లక్ష్యం, రైతుల్లో అనైక్యత, రాష్ట్ర విభజన ఆంధ్రా కాలువకు సాగునీరు రావడా నికి గండాలుగా మారాయి. మెట్ట ప్రాంతమైన చింతలపూడి మండలంలో సుమారు ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందడానికి నిర్మించిన ఆంధ్రా కాలువ పరిధిలోని రైతుల కష్టాలను పట్టించుకున్న నాథుడే లేడు.

- తెలంగాణ భాగంలో పూడికలు
- కాలువ గట్లు ఆక్రమణ
- 24 చెరువులకు అందని సాగునీరు
- ఏడు వేల ఎకరాలకు నీటి సమస్య
- అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని రైతుల విజ్ఞప్తి



భారీ చెట్లతో నిండిన ఆంధ్రా కాలువ

చింతలపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సరిహద్దులోని తుమ్మూరు ప్రాజెక్టు నుంచి ఎడమవైపు చింతలపూడి ప్రాంతానికి వచ్చే కాలువను ఆంధ్రా కాలువగా, తెలంగాణలోని తుమ్మూరు వైపు వెళ్ళే కాలువను తుమ్మూరు కాలువగా పిలుస్తుంటారు. తమ్మి లేరు ప్రాజెక్టు ఎగువన బేతుపల్లి చెరువు అలుగు నుంచి వచ్చే అదనపు నీరు తమ్మిలేరు రిజర్వాయరులోకి చేరు తుంది. ఈ మధ్యలో తుమ్మూరు వద్ద ఇరువైపులా మెట్ట ప్రాంతాల సాగునీరు కోసం తొలుత అడ్డుగోడ నిర్మించి రెండు వైపులా గేట్లు ఏర్పాటు చేసి కాలువలు తవ్వారు. 1973లో తుమ్మూరు వద్ద నుంచి కాంతంపాలెం వరకు 14 కిలోమీటర్ల కాలువను తవ్వి లింగ సముద్రం, పోతునూరు ఛానల్, వెంకటాద్రి చెరువుల వద్ద మూడు గేట్లు బిగించి ఆంధ్రా కాలువ ద్వారా వచ్చే సాగునీరు ఈ గేట్ల ద్వారా 24 చెరువులకు చేరేలా నిర్మించారు. ఏడు వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎగువ వరద తమ్మిలేరులోకి వచ్చినప్పుడు లేదా కొద్ది వరద వచ్చినప్పుడు ఉపయోగ పడేది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రా కాలువ మూడు కిలోమీటర్ల పొడవున ఉన్న బుచ్చియ్యకుంట వరకు తెలంగాణ ప్రాంతంలోకి వెళ్ళింది. ఆంధ్రా కాలువ గేట్లు తెలంగాణ ప్రాంతంలోకి చేరాయి. బుచ్చియ్యకుంట నుంచి కాంతం పాలెం వరకు ఈ కాలువ ఆంధ్రా ప్రాంతంలో ఉంది. ప్రస్తుతం ఆంధ్రా కాలువ గేట్లు సరిగా పని చేయడంలేదు. మూడు కిలో మీటర్ల పొడవున కాలువ పూడిక పేరుకు పో యి చెట్లు మొలిచాయి. తెలంగాణ ప్రాంత తుమ్మూరు రైతుల అవసరాలు పరిగణ నలోకి తీసుకోవడం వల్ల సాగునీరు తగ్గిపోయింది. గత ప్రభుత్వంలో అప్పటి ఎంపీ కోటగిరి శ్రీధర్ సుమారు రూ.32 లక్షల వ్యయంతో బుచ్చియ్యకుంట నుంచి 3.2 కిలోమీటర్ల మేర కాలువను బాగు చేశారు. దిగువ వరకు మరో రూ.30 లక్షలు వెచ్చి స్తే పూడికలు తొల గు తాయి. తెలంగాణ లోకి వెళ్లిన ఆంధ్రా కాలువ ప్రధాన గేట్లు, మూడు కిలోమీటర్ల పొడవున కాలువకు మరమ్మతులు చేయాలని ఇటీవల ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు అంచనా (మిగతా 8వ పేజీలో)

ఆక్రమణల చెరలో ఆంధ్రా కాలువ



14 కిలోమీటర్ల పొడవు ఉన్న ఆంధ్రా కాలువ మండలంలోని ఓ భాగం రైతులకు చాలా ఉపయోగం. కాలువకు నీరు రాకపోవడం వలన ఆక్రమణల జోరు పెరిగింది. జిల్లా అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకుని ఆంధ్రా కాలువకు మరమ్మతులు చేయాలి.

- గిరి భోగారావు, రైతు, డి.ఎన్.రావుపేట

పట్టించుకునే నాథుడే లేడు



ఆంధ్రా కాలువను పట్టించుకున్న నాథుడు లేడు. రాష్ట్ర విభజనలో కొంతభాగం తెలంగాణలోకి పోయింది. మరమ్మతులు చేపట్టే చర్యలు లేవు. దీనివల్ల సాగునీరు రావడం లేదు. భద్రాచలం వద్ద నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఆంధ్రా కాలువకు దారి దొరుకుతుంది. ఇందుకు ప్రభుత్వం కృషి చేయాలి.

- గుత్తా వెంకటేశ్వరరావు, జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు, శివపురం

బీఎండీ చానెల్ షట్టర్లు శిథిలం

- పూర్తిగా ఒక షట్టర్ మూసివేత
- రెండో షట్టర్ నుంచి అరకొర నీరు
- సగం ఆయకట్టుకే నీటి సరఫరా
- ఎండుతున్న శివారు భూములు
- రైతులు ఆవేదన



కమలాపురం హెడ్ లాకుల వద్ద శిథిలమై మూతపడిన షట్టరు



ఒక షట్టర్ ద్వారా విడుదల చేస్తున్న అరకొర నీరు (ఇది కూడా దాదాపు శిథిలమైంది)

ముదినేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): వేలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరందించే బంటుమిల్లి మెయిన్ డిస్ట్రిబ్యూటరీ చానెల్ (బీఎండీ చానెల్) షట్టర్లు శిథిలం కావడంతో నీటి విడుదలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. బంటుమిల్లి ప్రధాన కాలువకు కమలాపురం లాకుల వద్ద బ్రిటీష్ హయాంలో నిర్మించిన షట్టర్లు శిథిలావస్థకు చేరాయి. కొత్త షట్టర్లను ఏర్పాటు చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు ఏ చర్యలు తీసుకోవడం లేదు. ఈ చానెల్ కింద ముదినేపల్లి, బంటుమిల్లి మండలాల పరిధిలో 12 వేల ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరందించాల్సి ఉంది. రెండు షట్టర్ల ద్వారా 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నా పూర్తిగా శిథిలమైన ఒక షట్టర్‌ను మూసేయడంతో రెండో షట్టర్ ద్వారా 60 నుంచి 75 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. మరో పది క్యూసెక్కుల నీటి విడుదల పెంచితే 90 శాతం శిథిలమైన రెండోవ షట్టర్ నీటి ప్రవాహ తాకిడిని తట్టుకోలేక కూలిపోయే ప్రమాదం ఉంది. దీంతో సుమారు ఐదు నుంచి ఆరు వేల ఎకరాలకు మాత్రమే నీరందే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం ముదినేపల్లి మండలం వాడవల్లి, వణుదుర్రు, చినవాడవల్లి, కొత్తపల్లి, రావిగుంట, నారాయణపురం, దేవపూడి, వూటుకూరు గ్రామాల పరిధిలో సుమారు నాలుగు వేల ఎకరాల భూములకు నీరందక నారుమళ్లు ఎండిపోవడంతో పాటు, పొలాలను దుక్కులు చేసుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో సార్వా సాగుపై రైతుల్లో ఆందోళన నెలకొంది. నీటి విడుదలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి నూతన షట్టర్లు నిర్మించాలని కోరుతున్నారు.



పేదలకు నాణ్యమైన బియ్యం

మిల్లర్ల నుంచి సేకరణలో కొత్త విధానం రూపకల్పన

పేదలకు నాణ్యమైన బియ్యం అందించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మిల్లర్ల నుంచి బియ్యం సేకరణలో సమూల మార్పులు చేయ నుంది. రైస్ మిల్లర్ల నుంచి 25శాతం నూకతో బియ్యం సేకరిస్తోంది. ఇకపై 10శాతం నూకతో మాత్రమే బియ్యాన్నే తీసుకునేలా కార్యాచరణ రూపొందించింది. రాష్ట్రంలో బియ్యం సేకరణ పైలట్ ప్రాజెక్ట్‌గా చేయడంతో ఉమ్మడి పశ్చిమ జిల్లా నుంచి 6,500 టన్నుల బియ్యాన్ని భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కు అప్పగించారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

- రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు
- బియ్యంలో నూక శాతం కోత
- ఇప్పటి వరకు క్వింటాలు బియ్యంలో 25 శాతం నూక.. 10 శాతానికి తగ్గింపు
- మిగిలిన నూక మిల్లర్ల వద్ద నిల్వ
- నిల్వ సామర్థ్యం లేదంటున్న మిల్లర్లు
- ఇథనాల్‌కు నూక తరలించే యోచన
- స్పష్టత లేదంటూ మిల్లర్ల ఆందోళన
- బియ్యం పరిమాణం తగ్గించాలని డిమాండ్

జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో వరిసాగుతో రైస్ మిల్లులు ధాన్యంతో రద్దీగా ఉంటాయి. పది శాతం నూకతో ప్రభుత్వ బియ్యం సేకరిస్తే మిగిలిన 15 శాతం నూక పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. మిల్లర్లకు నూక నిల్వ చేసుకునే సామర్థ్యం ఉండదు. ఎక్కువ రోజులు నిల్వ చేస్తే నూక నాణ్యత కోల్పో వడమే కాక పురుగు పట్టే అవకాశాలు ఎక్కువ. భారత ఆహార సంస్థ ద్వారా కేంద్రం సేకరించేంత వరకు మిల్లుల్లో భద్రపరచుకోవాలంటే కష్టసాధ్య మని మిల్లర్లు గగ్గోలు పెడుతున్నారు. ధాన్యం ఎన్నాళ్లు ఉంచినా దెబ్బతినదు. మరాడించిన తర్వాత బియ్యం నిల్వ చేయడం రైసుమిల్లులో సాధ్యం కాదు. ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి అప్పగిస్తుం టారు. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో రైస్ మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు.

నష్టం పూడుస్తారా..?

ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ బియ్యంలో 25 శాతం నూకతో తీసుకుంటోంది. ఇకపై 10శాతం నిబంధనతో మిగిలిన 15 కిలోలు బియ్యం రూపం లో మిల్లర్లు అప్పగించాలి. దీనితో మిల్లర్లకు కొంత మేర నష్టం వాటిల్లనుంది. ప్రభుత్వం సేకరిస్తున్న బియ్యం ధర రూ.35 పడుతోంది. నూక రూ.23 ధరకు విక్రయిస్తున్నారు. మిల్లర్లు 15 కిలోలు నూకకు బదులు బియ్యం అప్పగించాల్సి ఉండడంతో క్వింటాల్‌కు రూ.180 నష్టపోనున్నారు. ఆ నష్టాన్ని భర్తీ చేయనున్నట్టు కేంద్రం ప్రకటించినా నిర్ణయం తీసుకోలేదు. కేంద్రం ఎంత మేర భర్తీ చేస్తుందనే విషయంపై మిల్లర్లు తర్జన భర్జన పడుతున్నారు. ప్రస్తుత లెక్క ప్రకారం రూ.180 నష్టాన్ని బియ్యం రూపంలో తగ్గించాలంటూ మిల్లర్ల డిమాండ్. ప్రస్తుతం కస్టమ్ మిల్లింగ్ అమలుతో మిల్లులు మనుగడ సాగిస్తున్నాయి. ప్రభుత్వం క్వింటాల్ ధాన్యం ఇస్తే మిల్లర్లు 67 కిలోలు బియ్యాన్ని ఇస్తు న్నారు. కేంద్రం 25 నుంచి 10శాతానికి నూక తగ్గిం చడంతో క్వింటాల్‌కు తీసుకునే బియ్యం పరిమాణాన్ని తగ్గించాలన్న డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్రంలో 15 శాతం నూక

ప్రజలకు నాణ్యమైన బియ్యం ఇవ్వాలని ప్రభు త్వం 15శాతం నూకతో బియ్యం తీసుకుంటోంది. తాలు, తప్పలు 1.5శాతం మాత్రమే ఉండాలని స్పష్టం చేసింది. దీనికోసం మిల్లర్లు సార్టెక్స్ యంత్రా లను అమర్చుకున్నారు. ప్రభుత్వం 25 శాతానికి బదులుగా 15శాతం నూకతో బియ్యం సేకరిస్తుం డడంతో మిల్లర్లుకు నూక వ్యత్యాసం, సార్టెక్స్ చార్జీల రూపంలో క్వింటాల్‌పై రూ.110 చెల్లిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏకంగా 10 శాతానికి తగ్గించింది. ఫలి తంగా బియ్యం, నూక ధరలో వ్యత్యాసం రూ.180 ఉంటోంది.

రాష్ట్రం సానుకూలం

తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించాయి. రాష్ట్ర ప్రభుత్వం సానుకూలతతో ఉంది. బియ్యంతోపాటే నూక కూడా తీసుకోవాలన్న డిమాండ్ మిల్లర్ల నుంచి వినిపిస్తోంది. లేదంటే నూకను మిల్లర్లకు విడిచిపెట్టేయాలని ప్రతిపాదిస్తున్నారు. క్వింటాల్ బియ్యానికి అయ్యే వ్యత్యాసాన్ని నగదుకు బదు లుగా బియ్యం రూపంలో తగ్గించాలన్న డిమాండ్ మిలర్లనుంచి వినిపిస్తోంది. లేని పక్షంలో మిల్లింగ్ పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోతుందని ఆందో ళన చెందుతున్నారు. ఇదే జరిగితే రైతులతో బేర సారాలు సాగించి నూక శాతం అధికంగా ఉందని కోత విధిస్తారు. కేంద్రం నిర్ణయంతో నష్టంవస్తే రైతుల వద్ద కోత పెట్టే ప్రమాదం కూడా ఉంది. జిల్లాలో రెండు సీజన్‌లలో ధాన్యం సేకరి స్తున్నారు. ఫలితంగా మిల్లులవద్ద నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంటుంది. రెండు సీజన్‌లలో దాదాపు 7 లక్షల టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగిస్తుంటారు. దీనికి సంబంధించి సుమారు రూ.1.05 లక్షల టన్నుల నూక నిల్వ చేయాల్సి ఉంటుంది. అంత సామర్థ్యం మిల్లుల వద్ద లేదు. పైలట్ ప్రాజెక్ట్ ఫలితాలు పూర్తిస్థాయిలో వచ్చిన తర్వాతే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 10శాతం నూకపై నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

ఇథనాల్‌కు నూక

బియ్యం సేకరణలో నూక శాతం తగ్గింపు నిర్ణయం తీసుకున్న కేంద్రం మిగిలిన 15శాతం నూకను మిల్లర్ల నుంచి సేకరించి ఇథనాల్ ఉత్పత్తి కోసం ప్రైవేటు కంపెనీలకు అప్పగించే యోచనలో ఉంది. దీంతో రేషన్ లబ్ధిదారులకు నాణ్యమైన బియ్యం సరఫరా కావడంతో పాటు నూక ఇథనాల్‌కు వెళ్లడం మంచి నిర్ణయమని పలువురు భావిస్తున్నారు. ప్రభుత్వం నూక సేకరించే వరకు మిల్లుల్లోనే నిల్వ ఉంచాలన్న నిర్ణయమే చర్చనీయాంశంగా మారింది.

నిల్వ చార్జీల్లో గందరగోళం

మిల్లుల్లో నిల్వ చేయడానికి క్వింటాల్‌కు అద నంగా రూ.1.23 ఇస్తామని కేంద్రం ప్రకటించింది. ఇప్పటివరకు నిల్వ చార్జీలే ఇవ్వడం లేదు. ఎంత అనేది మిల్లర్లకూ తెలియదు. ఇప్పుడు కూడా నూక నిల్వలకు చార్జీలు చెల్లించరనే అనుమానాలు మిలర్లలో నెలకొంది. ప్రైవేటు గోదాముల్లో నిల్వ చేస్తే క్వింటాల్‌కు రూ.10 చెల్లిస్తున్నారు. మిల్లర్లకు అటువంటి అవకాశం లేదు.


ఇళ్ల నిర్మాణాల్లో ప్రగతి సాధించాలి : కలెక్టర్



ఏలూరు సిటీ/ఏలూరు రూరల్/ఏలూరు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మంచి ప్రగతి సాధించాలని కలెక్టర్ వెట్రిసెల్వి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలె క్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో గృహ నిర్మాణ ప్రగతి తీరును జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇళ్ల నిర్మాణ లక్ష్యాలను సాధించేందుకు రానున్న 12 రోజులు ఎంతో కీలకమన్నారు. ప్రగతి చూపిన ఇంజనీరింగ్ అసిస్టెంట్లను గుర్తించి సత్కరిస్తామన్నారు.

- జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి కలెక్టరేట్‌లో మండలాల వారీగా సమీక్షించారు. జిల్లాలో పర్యాటక కేంద్రా లు, ప్రభుత్వ వసతి గృహాల్లో 258 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయన్నారు.
- జాతీయ రహదారులు, పారిశ్రామిక వాడలకు భూసేకరణ, నిర్మాణ పను ల్లో కాలయాపనచేసే అధికారులను గుర్తించి బాధ్యులుగా చేస్తామని కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వారు శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు.
- స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ఈనెల 19న సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం -పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం అనే థీమ్‌పై ప్రజలకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించనున్నట్టు కలెక్టర్ వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఈ కార్యక్రమం నిర్వహణపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు.

గోదావరి వెస్ట్రన్ డివిజన్ ఈఈ సస్పెన్షన్



పాలకొల్లు, జూలై 18(ఆంధ్రజ్యోతి):గోదావరి వెస్ట్రన్ డివిజన్ (నిడదవోలు) కార్యనిర్వాహక ఇంజ నీర్ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్టు జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు కార్యా లయం ఒక ప్రకటన విడుదల చేసింది. రబీ పంట అనంతరం నిడదవోలు రైల్వే ఫ్లయ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అనుమతి ఇవ్వగా క్రాస్‌బండ్‌ను కాల పరిమితి దాటినా తక్షణమే తొలగించకపోవడం, కాకరపర్రు రెగ్యులేటర్ గేట్లవద్ద తూడు, తొలగించక పోవడం, ఓఅండ్ఎం నిధులు విడుదల చేసినా తగిన సమయంలో పనులు చేపట్టకపోవడం వల్ల గోదావరి వెస్ట్రన్ ప్రధాన కాలువ పరిధిలోని బ్యాంక్ కెనాల్, నిడదవోలు-నరసాపురానికి సంబంధించిన నియోజకవర్గాల్లో సాగు నీరు కొరత ఏర్పడిందని, ఈ పరిణామాలను తీవ్రంగా పరిగణించి ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్టు ఆ ప్రకటనలో తెలిపారు. సాగు నీటి నిర్వహణ అంశంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర మైన క్రమశిక్షణ చర్యలు ఉంటాయని మంత్రి కార్యాలయం ఆ ప్రకటనలో పేర్కొంది.

పామాయిల్ రైతులకు ఊరట

- నాలుగేళ్ల బకాయిలు విడుదల

■ లోపలి పేజీలో..



తాడేపల్లిగూడెంలో దాడులు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నకిలీపై నిఘా

ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

రైతులు నష్టపోకుండా అప్రమత్తత

తేడా కనిపిస్తే లైసెన్స్ సీజ్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎరువులు పక్క దారి పట్టకుండా విజిలెన్స్ అధికారులు ముమ్మర దాడులు చేస్తున్నారు. ఒక పక్క ఎరువులు మరోపక్క పురుగుమందుల దుకాణాల్లో నకిలీలను అరికట్టేందుకు ప్రభుత్వం ఇతర జిల్లాల నుంచి వ్యవసాయాధికారుల ద్వారా విజిలెన్స్ దాడులు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ప్రైవేటు ఎరువుల డీలర్లతో పాటు కంపెనీల గోదాములపై దాడులు చేస్తు అనుమతులు లేని కంపెనీల ఎరువులు, పురుగుమందుల విక్రయాలు నిలుపుదల చేస్తూ రైతులకు నాణ్యమైన ఎరువులు అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఇప్పటికే విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో సుమారు కోటీ 3 లక్షల రూపాయల విలువ చేసే ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు. జిల్లాలో తాడేపల్లిగూడెం, ఉండి, భీమవరం, కాళ్ల, ఆకివీడు, అత్తిలి, పెనుగొండ, పాలకొల్లు నరసాపురం ప్రాంతాల్లో ప్రైవేటు ఎరువుల దుకాణాలతో పాటు తణుకులోని తయారీ ఫ్యాక్టరీల్లో విజిలెన్స్ బృందాలు తనిఖీ చేశాయి.

ప్రైవేటు దుకాణాలే లక్ష్యం

ప్రభుత్వం ఎరువులు సొసైటీల ద్వారా అందిస్తుండగా వాటిని మినహా జిల్లాలో గతంలో అనుమానాస్పదంగా విక్రయాలు చేసే ఎరువుల దుకాణాలు, కంపెనీల గోదాములు, తయారీ ఫ్యాక్టరీలే లక్ష్యంగా విజిలెన్స్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. విజిలెన్స్ తనిఖీల్లో ఎక్కువగా లైసెన్స్‌లు ముగిసిన కంపెనీల ఎరువులను గుర్తించి వాటి విక్రయాలు నిలుపుదల చేశారు. గతంలో అత్యధికంగా ఉండే నకిలీ పురుగుమందులు ఎక్కడా బయట పడలేదు. తూర్పు గోదావరి జిల్లా విజిలెన్స్ అధికారి బుల్లిబాబు పర్యవేక్షణలో దాడులు సాగుతున్నాయి.

విత్తనాలు, ఎరువుల నియంత్రణకు..

ప్రతీ సంవత్సరం ఖరీఫ్ సాగుకు ముందు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సాగుభూమికి సరిపడా ఎరువులు, విత్తనాలు బ్లాక్ చేసి రైతులను దోచుకునే వ్యాపారులకు ఈ విజిలెన్స్ దాడులతో చెక్ పెట్టనున్నారు. ఇటు అధికార సిబ్బందిని, వ్యాపారులను అప్రమత్తం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఈ నియంత్రణ చర్యల్లో భాగంగా విజిలెన్స్ బృందాలు ఇతర జిల్లాల అధికారులకు డ్యూటీలు వేయడం ద్వారా ప్రత్యేకంగా అప్రమత్తం చేసినట్టవుతోంది. ఈ తరహా దాడులు గతంలో జరిగినా తూతూమంత్రంగానే సాగేవి. కానీ రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవడంలో ఈ విజిలెన్స్ దాడులు కీలక పాత్ర పోషిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు.



ఆచంట, నరసాపురంలో తనిఖీలు

ఆచంట /నరసాపురం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలంలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలు, షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వ్యవసాయ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొడమంచిలిలో ఉన్న లక్ష్మి రాఘవేంద్ర ఆగ్రో కెమికల్స్ దుకాణంలో రూ. 3 లక్షల 67 వేల 062 రూపాయలు విలువ గల బయో స్టిమ్యులేట్స్ ఎరువులకు సరైన రికార్డులు లేనట్లుగా అధికారులు గుర్తించారు. సహాయ సంచాలకులు బుల్లిబాబు, విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, మండల వ్యవసాయాధికారి నాగరాజు ఉన్నారు. నరసాపురం మండలంలోని ఎరువులు, పురుగుల మందుల దుకాణాలు, గోడౌన్లలో విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రైతులకు స్టాక్ ఇచ్చిన వెంటనే బిల్లులు అందించాలన్నారు. స్టాక్ వివరాలు ఎప్పటి కప్పుడు నోటీస్ బోర్డుల్లో ఉంచాలన్నారు. ఏవో జ్యోషి పాల్గొన్నారు.

నరసాపురంలో ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు



సిద్దాపురంలోని వర్మీ కంపోస్టు తయారీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

గుర్రపు డెక్కతో వర్మీ కంపోస్టు

రెండు నెలల్లో 7 టన్నులు ఉత్పత్తి ...మహిళలకు స్వయం ఉపాధి

పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అభినందనలు

ఆకివీడురూరల్ జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్టు తయారీ విజయవంతంమైందని, డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి కలుగుతుందని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. ఆకివీడు మండలం సిద్దాపురంలో గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్టు (పైలెట్ ప్రాజెక్టు) తయారీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. పంట కాలువలలో గుర్రపుడెక్క వల్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతు అనేక వ్యయ ప్రయాసల కోరుస్తున్న తరుణంలో గుర్రపుడెక్కతో వర్మీ కంపోస్టు తయారీ విజయవంతమవుతుండటం మంచి పరిణామమన్నారు. దీని వల్ల మహిళలకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. జిల్లాలో ఇదేవిధంగా తయారీ కేంద్రాలను ప్రోత్సహిస్తామని తెలిపారు. వర్మీ కంపోస్టు తయారీలో ఎదుర్కొన్న సవాళ్లను మహిళలను అడిగి తెలుసుకున్నారు. వర్మీ కంపోస్టు తయారీకి ఇప్పటి వరకు సుమారు 80 వేలు పెట్టుబడి పెడితే 10 టన్నులు దిగుబడి వచ్చిందని డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాలరావు తెలిపారు. టన్ను రూ.12 వేలుకు విక్రయాలు జరుగుతున్నదని తెలిపారు. డ్వాక్రా గ్రూపులకు లాభాలతో పాటు జీతాలు వస్తాయని తెలిపారు. తహసీల్దారు వెంకటేశ్వరరావు, సర్పంచ్ చిట్టిబాబు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బొర్రా సుజాత, ఇన్‌ఛార్జి ఎంపీడీవో మార్కండేశ్వరరావు, ఏపీఎం, డ్వాక్రా గ్రూపు సభ్యులు తదితరులున్నారు.



జాతీయస్థాయి బ్యాడ్మింటన్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించిన ఆరిమిల్లి

ఎస్‌కేఎస్‌డీలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

తణుకు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు క్రీడా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో తణుకు ఎస్‌కెఎస్‌డీ కళాశాల ఫౌండేషన్, గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ అంతర్జాతీయ సౌకర్యాలతో ఇండోర్ స్టేడియం నిర్మించడం అభినందనీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం కళాశాల ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభించారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సత్య ఉషారాణి మాట్లాడుతూ క్రీడాకారులు పోటీలలో మంచి క్రీడా స్ఫూర్తితో విజేతలుగా నిలవాలని చెప్పారు. అసోసియేషన్ కార్యదర్శి మెంటే వంశీకృష్ణ మాట్లాడుతూ పోటీలు అండర్-19 పురుషులు, మహిళలు, వెటరన్స్ 35 నుంచి 75 ప్లస్ విభాగాలలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఎంపికైన వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన సమ్మెట్ల హేమంత్, ఆకుల త్రిలోక్, మాన్ మనోజ్ఞ, చల్లా విజయచరన్‌లను కళాశాల యాజమాన్యం సత్కరించింది. టోర్నమెంటు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సతీష్‌బాబు వ్యవహరిస్తున్నారు.

రేపు జూనియర్ బాలికల బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కాకినాడ జిల్లా పిఠాపురంలో ఆగస్టు 14 నుంచి జరిగే 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాస్కెట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 20వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి ఏలూరు కస్తూరిబా మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, సెక్రటరీ గవ్వా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు హాజరయ్యేవారు 2007 జనవరి 1వ తేదీ తరువాత జన్మించినవారై ఉండాలని, ఒరిజినల్ పుట్టిన తేదీ, ఆధార్ ధృవపత్రములు తీసుకుని రావాలన్నారు. వివరాలకు 94411 71933 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

పామాయిల్ రైతులకు ఊరట

నాలుగేళ్ల బకాయిలు విడుదల



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్ పెట్టిన పామాయిల్ రైతుల బకాయిలను చెల్లిస్తూ కూటమి ప్రభుత్వం రైతులకు ఊరటనిచ్చింది. ఉద్యాన పంటలకు ఊతం ఇచ్చే లక్ష్యంతో ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త తోటలు వేసేందుకు చిన్న,సన్నకారు రైతులకు ప్రోత్సాహం అందిస్తుండగా తాజాగా గతంలో ఆయిల్‌పాం మొక్కలు నాటడం నుంచి నిర్వహణ ఖర్చులు ఇవ్వకుండా జగన్ సర్కార్ మొండిచేయి చూపించింది. నాలుగేళ్ల బకాయిలు రూ.2.35 కోట్లను విడుదల చేసింది. జిల్లాలో రెండువేల మంది రైతులకు ఈ బకాయిలు అందాల్సి ఉండగా 80 శాతం మంది రైతులు తాడేపల్లిగూడెం ప్రాంతానికి చెందిన వారే. దీంతో పామాయిల్ బకాయిలపై ఆశలు వదలేసుకున్న సమయంలో కూటమి సర్కారు. పాత బకాయిలు చెల్లించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. 2021 నుంచి 2025 సంవత్సరాల మధ్యకాలంలో నూతనంగా పామాయిల్ సాగు వైపు అడుగులు వేసిన రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. కానీ రైతులు వేసిన పంటకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకం ఇవ్వకుండా జగన్ సర్కారు నీరుగార్చింది. దీనిపై రైతులు కొన్నాళ్లు ఎదురు చూశారు. అధికారులను వేడుకున్నారు. కానీ ఫలితం లేకపోవడంతో ఆశలు వదిలేసుకున్నారు. కూటమి ప్రభుత్వం పామాయిల్ మొక్కల నిర్వహణకు హెక్టారుకు రూ.29 వేలు, ఎరువులు, పురుగుమం దులకు రూ.5,250 చొప్పున ప్రోత్సాహ కాలు ప్రస్తుతం రైతులకు అందించనున్నారు.

- **ఆశలు వదిలేసుకున్నాం..**

గత ప్రభుత్వం రైతులకు అందించాల్సిన బకాయిలు ఇవ్వకుండా వదిలేసింది. ప్రభుత్వం మారడంతో ఆ బకాయిలు వస్తాయనే ఆశలు వదిలేసుకున్నాం. కానీ కూటమి ప్రభుత్వం గత బకాయిలతో పాటు ప్రస్తుత సంవత్సరానికి అందించాల్సిన ప్రోత్సాహకాలు అందించడం మేమంతా ఆనందంగా ఉన్నాం. ఈ బకాయిలే కాకుండా ఉద్యాన పంటలకు మంచి ప్రోత్సహకంగా ప్రభుత్వం పనిచేస్తుంది.

- ఉప్పలపాటి యువరాజు, రైతు, కొమ్ముగూడెం

చుట్టూ నరక రహదారులు

చింతలపూడి నియోజకవర్గంలో రోడ్లన్నీ గోతులమయం

చింతలపూడి (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నియోజకవర్గ కేంద్రం చుట్టూ వెళ్లే రహదారులన్నీ నరకప్రాయంగా ఉన్నాయి. చింతలపూడి-ఏలూరు మార్గంలో వెలగలపల్లి మొక్కజొన్న ఫ్యాక్టరీ వరకు అడుగడుగునా గోతులే. కామవరపుకోట రోడ్డులో జీలకర్ర గూడెం వరకు గోతులే. నూజివీడు రోడ్డు మంకొల్లు వరకు, తెలంగాణ సత్తుపల్లి వెళ్లే గురుభట్లగూడెం రోడ్డు, సీతానగరం రోడ్డు, అల్లిపల్లి రోడ్డు, యర్రగుంటపల్లి నుంచి జీలుగుమిల్లి వెళ్లే రోడ్డు, చింతలపూడి నుంచి టి.నర్సాపురం వెళ్లేరోడ్డు, బాలువారి గూడెం వెళ్లే రోడ్లు నరకప్రాయంగా మారాయి. అడుగడుగునా గోతులు, కొన్నిచోట్ల పదును తేలి రాళ్లు పైకి లేవడంతో ప్రయాణం చేయా లంటే వాహనదారులు భయపడుతున్నారు. ఎదురుగా వాహనాలు వచ్చినా ఇబ్బందులే. ఇవన్నీ ఆర్‌అండ్‌బీ రోడ్లే. మరోపక్క ఈ రోడ్లకు అడుగడుగునా గోతులతో పాటు మరోపక్క ఆక్రమణల జోరు. రోడ్డుకిరువైపులా వర్షపునీరు వెళ్లే డ్రైయినేజీ దారులను మూసివేసి రోడ్డు వరకు ఆక్రమించి ఫెన్సింగ్‌లు వేయడం, చిన్నచిన్న దుకాణాలు పెట్టడం పెద్ద సమస్యగా మారింది. వర్షం నీరు పోయే దారిలేక రోడ్లు పాడవుతున్నాయి. అధికారులు పట్టించుకునే పరిస్థితి లేదు. చిన్న గోతులను కూడా పూడ్చడం లేదు. పెరుగుతున్న వాహనాల రాకపోకలు, బస్సు ప్రయాణం, గత ఐదేళ్ల ప్రభుత్వంలో నరకం చూశామని చెప్పిన ప్రజలు ఇప్పుడు ఏడాది పూర్తయినా అవే గోతులు, అవే నరకం.. ఎందుకో మాకు ఈ శాపమని విమర్శలు చేస్తున్నారు. ఏలూరు రోడ్డులో గతంలో వెలగలపల్లి వరకు రెండు, మూడు బస్సు ప్రమాదాలు జరిగాయి. ఈ మార్గాలలో బస్సులు తిప్పకపోవడానికి కారణాలు ఇవేనని ప్రజలు చెప్పుకుంటున్నారు. వర్షం పడితే ఆ గోతులు ఎంత లోతు ఉన్నాయో, రోడ్లలో ప్రమాదమైన రాళ్ళు ఉన్నాయా అనే భయాలతో రోడ్లలో వాహనాలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు తగ్గిపోయారు. అత్యవసర పనులు ఉంటేనే ప్రయాణిస్తున్నారు. కొందరైతే కార్లు ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారు. రోడ్ల గోతులు పూడ్చడమే కాకుండా కొత్త రోడ్లు వేయాలని, రోడ్లపక్కన ఆక్రమణలు తొలగించి వర్షం నీరు పోయే కందకాలు తవ్వాలని కోరుతున్నారు. ఏలూరు రోడ్డులో ఫాతిమాపురం వద్ద, చింతలపూడిలో మార్కెట్ యార్డు వద్ద రోడ్డు ఆక్రమించి చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో రోడ్లు కుంచించుకుపోయి ఇటు గోతుల రోడ్ల సమస్య, వాహన దారులు ప్రయాణించాలంటే భయాందోళనలకు గురవుతున్నారు. వీటికి పరిష్కారం చూపాలని కోరుతున్నారు.



గోతుల్లో దిగబడిన కారు



వర్షం పడితే గోతుల నిండా నీరు

ప్రోబ్లమ్ జోన్

జంక్షన్..టెన్షన్..

ప్రమాదాల నిలయంగా తేతలి వై-జంక్షన్

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే తణుకు వైజంక్షన్ వద్ద జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. వై జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభించారు. కోర్టు వివాదాల నేపథ్యంలో జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మాణ పనులను నిలిపివేయడంతో ఇక్కడ సరైన లైటింగ్ కానీ, ట్రాఫిక్ సిగ్నల్స్ కానీ లేకపోవడంతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక మంది క్షతగాత్రులుగా మారుతున్నారు. ఇక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం మొదటి నుంచి వున్న సెంట్రల్ లైటింగ్‌ను, సీసీ కెమెరాలను తొలగించారు. దీంతో ఇక్కడ చీకటిగా వుండి రాత్రి సమయాలలో ప్రమాదాలకు నిలయంగా మారిందని స్థానికులు అంటున్నారు. నిత్యం పట్టణం నుంచి జాతీయ రహదారికి ఇటు రావులపాలెం, తాడేపల్లిగూడెం వైపు వెళ్లే వాహనాలు, ఆర్టీసీ బస్‌లతో పాటు, ప్రైవేట్ ట్రావెల్ బస్సుల కోసం ఇక్కడ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రయాణికులు వేచి ఉంటారు. ఇక్కడ నుంచి నుంచి విజయవాడ, హైదరాబాద్, విశాఖపట్టణం వైపు వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ప్రయాణించే వారు ఇక్కడ దిగుతారు. ఇక్కడ విద్యుత్ లైట్లతో పాటు సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇక్కడ ప్రమాదాలు జరిగినా ఆధారాల కోసం పోలీసులు దూరంగా వున్న సీసీ ఫుటేజీపై ఆధారపడవలసి వస్తుందంటున్నారు. ఫ్లై ఓవర్ కోసం నిర్మించిన పిల్లర్లను చీకటిలో వాహన దారులు ఢీకొనడంతో పాటు వాహనాలు ఒకటికొకటి ఢీకొనడం కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. జాతీయ రహదారి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రోహిత్ కుమార్‌ను వివరణ అడగ్గా లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాటు గురించి పరిశీలించి ఏర్పాటు చేస్తామన్నారు.



తణుకు వై జంక్షన్ వద్ద సగంలో నిలిచిన పిల్లర్ల వద్ద బారికేడ్లు పెడుతున్న దృశ్యం

- **లైటింగ్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి**



వై-జంక్షన్ వద్ద రాత్రి సమయంలో తగినంత లైటింగ్ లేకపో వడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. పిల్లర్లు, మార్జిన్‌లలో బారికేడ్‌లు ఏర్పాటు చేయాలి. నిర్మాణ పనులు నిలిచి పోవడంతో ఇక్కడ రాత్రి సమయాల్లో లైటింగ్ సౌకర్యం కల్పించాలి. పిల్లర్ల వద్దే విద్యుత్, సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి.

- గెద్దం శ్రీను, తేతలి



ఏలూరు జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫ్లైఓవర్ బ్రిడ్జి ఎక్కేచోట ఎడమ వైపున కూలిన రక్షణ గోడ

ఫ్లైఓవర్‌పై ప్రమాదకరంగా..ప్రయాణం

ఏలూరు కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకు గల రైల్వే అండర్ ఫ్లైవోవర్ బ్రిడ్జిపై రోడ్డుకు ఎడమవైపున మూడు చోట్ల రక్షణ గోడలు కూలి దాదాపు ఏడాది కావస్తున్నది. అప్పటి నుంచి రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. ఎటువంటి ప్రమాదాలు జరగకముందే ఫ్లైవోవర్‌పై కూలిన రక్షణ గోడలను పునరుద్ధరించాలని లేదా రెయిలింగ్స్ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జూట్‌మిల్లు సెంటర్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు వెళ్ళే ఫ్లైవోవర్‌పై రోడ్డుకు ఎడమ వైపున ఎక్కే చోట రెండు చోట్ల, దిగే సమయంలో ఒక చోట రక్షణ గోడలు కూలి ఏడాది దాటినా తిరిగి నిర్మించలేదు. దీంతో బ్రిడ్జిపై ప్రయాణించాలంటే భయమేస్తోందని అంటున్నారు.



23వ వార్డులో పిచ్చి మొకలు పెరిగి నిరుపయోగంగా ఉన్న మున్సిపల్ పార్కు

పాములకు ఆవాసాలుగా పార్కులు

నిరుపయోగంగా మునిసిపల్ పార్కులు

పాలకొల్లు అర్బన్ (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు టౌణంలోని పార్కులు నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉన్నాయి. 23వ వార్డు బీఆర్‌ఎంవీఎం హైస్కూల్ వెనుక భాగంలో మున్సిపాలిటీ లేఔట్ చేసి రిజర్వు స్థలంగా వదిలిన సుమారు 60 సెంట్ల స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణం చేశారు. లోపల ఏ విధమైన అభివృద్ధి చేయకపోవడంతో పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి.వర్షపు నీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగిపోతున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాములు సంచరిస్తున్నాయి. ప్రతీ ఏటా తన సొంత ఖర్చుతో రెండు మూడు మార్లు పార్కు లోపలి భాగం శుభ్రం చేయించినట్టు స్థానికంగా ఉంటున్న విద్యావేత్త రమాకాంత్ తెలిపారు. ఎల్‌ఆర్‌పేటలోని పార్కులో పిచ్చిమొక్కలతో ప్రజలకు ఉపయోగం లేకుండా ఉంది. వీటి నిర్వహణ లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. 1962లో సీవీ రాజు పేరుతో నిర్మించిన పార్కు కొంతకాలం ప్రజలకు, బాలబాలికలకు వినియోగపడినా తర్వాత పిచ్చిమొక్కలతో వినియోగంలో లేదు. పార్కు సంరక్షించేందుకు తోటమాలి కానీ వాచ్‌మెన్‌కానీ లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈపార్కులో కొంత స్థలాన్ని స్థానిక యువకులు బాగుచేసుకుని వాలీబాల్ ఆడుకుంటున్నారు. 24వ వార్డులోని ఏపీఎస్ఎన్ కాలనీలో మొక్కలు లేకుండా 30 ఏళ్ళుగా పేరుకు పార్కుగా మిగిలింది. 30 ఏళ్ళక్రితం అప్పటి ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ చొరవతో ఏర్పాటు చేసిన కాలనీలో పార్కు స్థలానికి చుట్టూ ప్రహరీ నిర్మించి రెండు వైపులా గేట్లు పెట్టారు. 30 ఏళ్ళు అయినా నేటికీ వినియోగంలో లేదని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎల్‌ఆర్‌పేటలోని అధ్వానంగా ఉన్న సీవీ రాజు పార్కు



ముదినేపల్లిలో ప్రహరీ లేని అంగన్‌వాడీ కేంద్రం

రక్షణ ఏది ?

ముదినేపలి (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లిలో గ్రామ పంచాయతీకి చెందిన రెండు చెరువుల మధ్య ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి అదుపు లేక రక్షణ కరువైంది. అంబేడ్కర్ నగర్‌కు సమీపంలోని ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనానికి ప్రహరీ గోడ లేకపోవడంతో పిల్లలకు రక్షణ కల్పించడం సిబ్బందికి ఇబ్బందికరంగా ఉంది. ఈ అంగన్‌వాడీ కేంద్రం ముందువైపు పంచాయతీ రక్షిత మంచినీటి చెరువు, వెనుక వైపు పంచాయతీ చెరువులు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రం నుంచి బయటకు వెళ్లే పిల్లలను సిబ్బంది వెన్నంటే ఉండాల్సి వస్తున్నది. చెరువు పోరంబోకు భూమిలో ఈ అంగన్‌వాడీ కేంద్ర భవనం నిర్మించడం వల్ల పిల్లలు చెరువు గట్లు వెంబడే రావాల్సి వస్తున్నది. కేంద్రం చుట్టూ ప్రహరీ గోడను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



ముదినేపల్లి - గుడివాడ జాతీయ రహదారిలో చినపాలపర్రు శివారు అత్తివాని చెరువు గ్రామం వద్ద కోడూరు రోడ్డు సైడ్ డ్రెయిన్‌పై గల కల్వర్టుకు రెండు వైపులా రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా ఉంది. కోడూరు రోడ్డులోకి వెళ్లే వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. ఏడాది కాలంగా ఈ కల్వర్టు వద్ద ట్రాక్టర్లు, ఆటోలు రక్షణ గోడలు లేని కారణంగా బోల్తా పడ్డాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వెంటనే చర్యలు తీసుకుని కల్వర్టు వెడల్పు పెంచి రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో పాత భవనాలను తొలగిస్తున్న దృశ్యం

తణుకు ఆసుపత్రికి భవనాల సమస్య

ప్రత్యామ్నాయాలపై దృష్టి.. నిరుపయోగంగా ఉన్న ఉద్యోగుల క్వార్టర్స్ తొలగింపు

తణుకు (ఆంధ్రజ్యోతి) : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రికి భవనాల కొరత వేదిస్తున్నది. పేరుకు జిల్లా ఆసుపత్రి అయినప్పటికి దానికి తగిన విధంగా భవనాలు లేకపోవడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు ఎలాంటి భూ సేకరణ చేయలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ భవనాల నిర్మాణాల కోసం అవసరమైన చర్యలు చేపట్టారు. భూసేకరణ ఇప్పట్లో తేలేది కాదని ప్రత్యామ్నాయాలపై దృష్టి పెట్టారు. ఆసుపత్రి ప్రాంగణం లోని సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగుల నివాస ప్రాంగణ భవనాలు శిథిలావస్థకు చేరాయి. వాటిని ఎవరూ వినియో గించడం లేదు. ఏళ్ల తరబడి ఖాళీగా ఉంటున్నాయి. ఆ భవనా లను తొలగించడం ద్వారా వచ్చే స్థలాన్ని పూర్తిగా వినియో గించు కోవాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం అవసర మైన అన్ని అనుమతులు తీసుకుని భవనాలు తొలగించే కార్యక్రమం చేపట్టారు. పాత భవనాలు తొలగించిన స్థానంలో కొత్త భవనాలు నిర్మాణానికి తగినన్ని నిధులు రూ.20 కోట్లు కేటాంచారు. ఆ నిధులతో జిప్లస్ మూడు చొప్పున భవనాలు నిర్మాణాలు చేసే విధంగా ప్రతిపాదనలు తయారు చేశారు. దీనికి సంబంధించి ఇప్పటికే అవరసమైన అన్ని అనుమతులు పొందారు. ప్రస్తుతం పాత భవనాల తొలగింపు ప్రక్రియ కొనసాగుతుంది. పాత భవనాలు తొలగించడం ద్వారా వచ్చే ఖాళీ స్థలం బట్టి ఎన్ని నిర్మాణాలు చేయాలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆదేశాలు మేరకు నిర్ణయం తీసుకుంటామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సాయికిరణ్ తెలిపారు

మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా కొల్లు పెద్దిరాజు



నరసాపురం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నరసాపురం పట్టణానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కొల్లు పెద్దిరాజుకు ప్రభుత్వం మత్స్యకార సంక్షేమం కార్పోరేషన్ చైర్మన్ పదవిని కట్టబెట్టింది. ప్రస్తుతం మత్స్యకార సహకార సమాఖ్య చైర్మన్‌గా కొనసాగు తున్నారు. ఈ పదవిలో సాంకేతి కపర మైన ఇబ్బందులు కారణంగా ఆయనకు మత్స్యకార సంక్షేమ సంఘం చైర్మన్ పదవి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర కమిటీలో అనేక పదవులు చేపట్టారు. మంత్రి లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడుగా ముద్ర పడ్డారు. పెద్దిరాజుకు చైర్మన్ పదవి ఇవ్వడంపై విప్ నాయకర్, షరీఫ్, కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొప్పాడ రవి, సంకు భాస్కర్, షేక్ హుస్సేన్, వాతాడి ఉమా, గుబ్బల నాగరాజు, నాగబాబు, పద్మ, శశిదేవి, శ్రీదేవిలు అభినందనలు తెలిపారు.

రేపు పాలకొల్లులో దివ్యాంగులకు ఉపకరణాల ఎంపిక, గుర్తింపు శిబిరం

భీమవరం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల కోసం అవసరమైన ఉచిత ఉపకరణాల ఎంపిక, గుర్తింపు శిబిరాన్ని ఈనెల 20వ తేదీన పాల కొల్లులో నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు. సెయిల్ నుంచి 50 లక్షల రూపాయల సీఎస్ఆర్ నిధులను మంజూరు చేశామన్నారు. ఆదివారం పాల కొల్లు మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో అల్‌మోకో సంస్థకు చెందిన ప్రత్యేక వైద్య బృందం సేవలందిస్తారన్నారు. ఈ శిబిరం ద్వారా దివ్యాంగులకు అందించవలసిన ఉచిత ఉపకరణాలను డాక్టర్ల బృందం గుర్తిస్తుందని త్వరలో అర్హులకు కృత్రిమ అవయవాలు, వాకర్లు (వాకర్స్), ట్రైసైకిల్ , వీల్‌చైర్ , హియరింగ్ ఎయిడ్, కృత్రిమ కాలు , అంధుల కోసం స్టిక్‌లు, చెవి వినికిడి పరికరాలు, బ్యాటరీ ట్రైసైకిల్, తదితర పరికరాలను అందిస్తామన్నారు.

పోలవరం నుంచి 1,03,998 క్యూసెక్కులు విడుదల

పోలవరం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం నాటికి సాధారణ స్థాయికి తగ్గింది. ప్రాజెక్టు స్పిల్వే నుంచి 1,03,998 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.130 మీటర్లు, దిగువన 17.180 మీటర్లు నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

పట్టిసీమ నుంచి 7,788 క్యూసెక్కులు..

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 7,788 క్యూసెక్కుల జలాలను పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు విడుదల చేసినట్లు శుక్రవారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం ఈఈ ఏసుబాబు తెలిపారు. గోదావరి నీటిమట్టం 14 మీటర్లకు పైబడి ఉండడం వల్ల కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు ఖరీఫ్ సీజను సాగు నీటి అవసరాల రీత్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 22 పంపుల ద్వారా నీటి పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.



పత్తేపురంలో స్కూల్‌ను పరిశీలించిన కేంద్ర బృందం

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో వెనుకబాటు

భీమవరం టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందించే స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో పశ్చిమగ గోదావరి జిల్లా అనుకున్నంత స్థాయిలో ర్యాంకులను సాధించలేక పోయింది. కార్పొరేషన్‌లు, మునిసిపాల్టీలల్లో పచ్చదనం, పరిశుభ్రత, తడి, పొడి చెత్త సేకరణ, మార్కెట్ ఏరియాలో పరిశుభ్రత, డ్రైన్‌ల పరిశుభ్రత, పబ్లిక్ మరుగుదొడ్ల పరిశుభ్రతతో పాటు పలు అంశాలపై సర్వే చేసి వాటికి సంబంధించి ప్రత్యేక బృందం పర్యటించి వివరాలను సేకరించి ఇచ్చిన నివేదిక ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు. జిల్లాకు సంబంధించిన ర్యాంకులను పరిశీలిస్తే 50 లోపు ర్యాంకుల్లో కనిపించలేదు. భీమవరం మునిసిపాల్టీకి రాష్ట్ర స్థాయిలో 57వ ర్యాంకు రాగా పాలకొల్లు మునిసిపాల్టీకి 60, తణుకు మునిసిపాల్టీకి 64 , తాడేపల్లిగూడేనికి 99, నరసాపురం మునిసిపాల్టీకి 112 ర్యాంకు రాగా ఆకివీడుకు 119వ ర్యాంకు వచ్చింది.

పత్తేపురంలో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

నిడమర్రు జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కేంద్ర పత్తేపురం గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల,పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ కె.శివకుమారి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉన్నదీ లేనిది, వాటి పరిసరాలు ఏవిధంగా ఉన్నాయో తనిఖీ చేశారు. కేంద్ర బృందం సర్పర్‌తో ప్రత్యక్షంగా సర్వే చేశారు. వాటితో పాటు గ్రామంలో చెత్త నుంచి సంపద వృద్ధి కేంద్రం వద్ద చేస్తున్న చెత్త విడ దీయడం, ప్లాస్టిక్ గ్లాసులు తదితర వ్యర్థాలను వేరుచేయడం, వర్మీ కంపోస్టు తయారీని పరిశీలించారు. జిల్లా కన్సల్టెంట్ వి.ప్రేమజిత్, డీఆర్‌పీసీ కన్సల్టెంట్ ఎం.సురేష్‌కుమార్, ఎంపీడీవో విజయ కుమారి, ఈవోపీఆర్‌డీ స్వామి, పంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.



గిరమ్మ చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు

కామవరపుకోట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మండలం యడవల్లి గ్రామం నుంచి వెంకటాపురం గ్రామం వెళ్లే మార్గంలో గల గిరెమ్మ చెరువులో గురువారం ఎక్స్ కవేటర్ల ద్వారా మట్టి తవ్వకాలు జరిపి వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారు. యథేచ్ఛగా చెరువుల్లో అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులను వివరణ కోరగా ఆ చెరువులో తవ్వకాలు జరిపేందుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు.

మొబైల్ వార్

ఏలూరు కలెక్టరేట్ వద్ద మొబైల్ షాపులు, మొబైల్ విడి భాగాల షాపుల యజమానుల పోటాపోటీ ధర్నాలు



ధర్నా నిర్వహిస్తున్న మొబైల్ విడిభాగాల వ్యాపారులు

ఏలూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఏలూరులోని మొబైల్ షాపులు, మొబైల్ విడిభాగాల షాపుల యజమానుల మధ్య కోల్డ్‌వార్ నడుస్తోంది. ఈ క్రమంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం పోటాపోటీగా ధర్నాలు నిర్వహించారు. ఉదయం విడిభాగాల షాపు యజమానులు తమ షాపులకు, షాపులో పనిచేసే కార్మికులకు రక్షణ కల్పించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. సుమారు 15 ఏళ్ల క్రితం రాజస్థాన్ నుంచి వచ్చిన తాము ఏలూరులో షాపులు అద్దెకి తీసుకుని మొబైల్ విడి భాగాలు విక్రయిస్తున్నా మన్నారు. తాము మొబైల్స్ రిపేర్లు చేయకూడదని ఇటీవల తమ షాపులపై కొందరు వ్యక్తులు భౌతికదాడులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ధర్నాలో 17 మొబైల్ విడిభాగాల షాపు యజమానులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు, ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. కాగా సాయంత్రం తమ షాపులపై విడిభాగాల మొబైల్ షాప్ యజమానులు రౌడీ షీటర్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారని తమను ఆదుకోవాలని మొబైల్ షాప్ యజమానులు ధర్నా చేశారు. అసోసియేషన్ నాయకులు మదన్ మోహన్‌కుమార్, గురజాల సైమన్ తదితరులు మాట్లాడుతూ మొబైల్ విడిభాగాల షాపు యజమానులపై తాము ఎటువంటి దాడులు చేయలేదన్నారు. కావాలనే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.నాగేంద్రబాబు, షేక్ సాధిక్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మొబైల్ షాపు యజమానులు

సాగునీరివ్వండి..



ఎండిన పంటను పరిశీలిస్తున్న రైతులు

ఏలూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏలూరు రూరల్ మండలంలోని మాదేపల్లి, కాట్లంపూడి, లింగారావుగూడెం గ్రామాల్లో శుక్రవారం పర్యటించి ఎండిపోతున్న నారుమడులను పరిశీలించారు. కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు లేక నారుమళ్లు ఎండిపోతున్నాయని, పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తు న్న సాగునీటిని కేఈ కెనాల్‌లోకి మళ్లించి కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగు నీరిచ్చి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. అన్నంరెడ్డి రంగారావు, సుంకర నరసింహరావు, వి.రామారావు, పి.భాస్కరరావు, టి.రంగారావు, బైరెడ్డి కృష్ణారావు, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి



ముసునూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సాగుదారులు ధర్నా నిర్వహించారు. లిబరేషన్ పార్టీ మండల కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ రమణక్కపేటలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన పేదలు మూడు తరాలుగా వందల ఎకరాలు అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని, అయితే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం అందటం లేదన్నారు. ఈ భూముల్లో 1969లో సెక్షన్ 4 నోటిఫికేషన్ విధించటం జరిగిందని, జాయింట్ కలెక్టర్ పరిశీలించి సమస్య పరిష్కరించకుంటే ఈ నెల 21న ముసునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

పాత పెన్షన్ విధానమే కావాలి

ఏలూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని టీచర్స్ ఎమ్మెల్సీ బి. గోపిమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ తమది డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2003లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ అప్పటి ప్రభుత్వం కావాలనే నియామక ఉత్తర్వులు ఆలస్యంగా ఇచ్చిందన్నారు. 2004 సెప్టెంబరు 1 నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లోకి తెచ్చిందని, సీపీఎస్ విధానం అమలులోకి వచ్చిన తరువాత తమకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు కాబట్టి తమకు పాత పెన్షన్ విధానం వర్తించదని, రాష్ట్ర ప్రభుత్వం కావాలనే మోసం చేస్తోందని ఆరోపించారు. మెమో 57 ఆధారంగా రాష్ట్రంలో ముగ్గురు ఉన్నత ఐఏఎస్ అధికారులకు పాత పెన్షన్ వర్తింపజేస్తూ జీవో ఇచ్చారని, అధికారులకు ఒక న్యాయం ఉపాధ్యాయులకొక న్యాయమా, ఇది వివక్ష కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆగస్టులో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ఈ విషయంపై తన గొంతు వినిపిస్తానన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎల్. సాయి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్. రవికుమార్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్వీడీ ప్రసాద్ మద్దతు తెలిపారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్లు జగదీష్, వెంకట్రావు, సూర్యప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.



ధర్నాలో పాల్గొన్న ఎమ్మెల్సీ గోపిమూర్తి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కృష్ణారావు

ప్రతి విద్యార్థి 'భోజనం' చేయాలి

పాలకొల్లు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేయాలని ఎండీఎం, ఎస్ఎస్ఏ సమన్వయ కర్త కె. కృష్ణారావు అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పోషక విలువలతో కూడి ఉంటుందని, అందువల్ల ప్రతి విద్యార్థి మధ్యాహ్న భోజనం చేసే విధంగా ఉపా ధ్యాయులు పర్యవేక్షించాలని సూచించారు. స్థానిక కొత్తపేట స్పెషల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం కృష్ణారావు ఆకస్మికంగా తనఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కాయగూ రలు పండించుకునే స్థలం ఉన్న పాఠశాలలకు ప్రభుత్వం ఏటా రూ.5 వేలు ప్రత్యేకంగా మంజూరు చేస్తోందని ఆయన తెలిపారు. వీవర్స్ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్, హెచ్ఎం విక్రాంత్ విజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కాళీపట్నం భూ రికార్డులు పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్

సర్వేను పరిశీలించిన జేసీ

మొగల్తూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాళీపట్నం రెవెన్యూ గ్రామాల్లోని సెటిల్‌మెంట్ భూములకు సంబంధించిన ఎంజాయ్‌మెంట్ సర్వేను శుక్రవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ భూములకు సంబంధించిన మ్యాప్‌లు పరిశీలించి వివ రాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, రైతులు మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలోని అడంగల్‌లో నమోదు చేసిన ఇళ్లకు సంబంధించి క్రయ, విక్రయాలకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించాలని జేసీని కోరగా గ్రామ కంఠం భూముల సర్వే అనంతరం తగు చర్యలు తీసుకుంటామని రైతులకు వివ రించారు. అనంతరం జగన్నాథపురం గ్రామ సచివాలయాన్ని సందర్శించి రికా ర్డులు పరిశీలించారు. రికార్డులన్నీ ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట నరసాపురం ఆర్డీవో దాసి రాజు, తహసీల్దార్ రాజ్ కిషోర్, జిల్లా కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, మండల సర్వేయర్ ఎ.ధనరాజ్, డీటీ కల్యాణి, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏలూరు క్రైం,జూలై18(ఆంధ్రజ్యోతి): ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మరణించి ఉన్నాడని రైల్వే ఎస్ఐ పి.సైమన్‌కు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడు అనారోగ్యంతో మరణించి ఉండవచ్చని ప్రాథమికంగా భావించారు. మృతుడు సుమారు 55 ఏళ్ల వయస్సు కల్గి, 5.5 అడుగుల ఎత్తు, బక్కచిక్కిన దేహధారుడ్యంతో ఉన్నాడు. తెలుపు, గులాబీ రంగు పొడవు చేతుల చొక్కా, సిమెంటు, నీలం రంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ పి. సైమన్ 99892 19559 సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మండవల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి):బాబా ఆలయానికి వెళ్లిన మహిళ చీరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండవల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలివి.. గ్రామానికి చెందిన గుడివాడ తాయారమ్మ(60) ప్రతి గురువారం బాబాగుడికు వెళ్లి పూజలు చేస్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 10న గురుపౌర్ణమి రోజున గుడికి వెళ్లి పూజలు చేస్తున్న క్రమంలో ఆమె చీరకు ప్రమాదవశాత్తు దీపం అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. తోటి భక్తులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఏలూరులోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్పించగా వైద్య సేవలు పొందుతూ 17న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ భద్రం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు



గాయాలైన రాంబాబు

ఏలూరు క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఓ రైతు పొలంలో కోకో కాయలు కోస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైరుకు తాను కోసే కత్తితో ఉన్న ఐరన్ గొట్టం తగిలి విద్యుత్ ప్రవాహం సంభవించి తీవ్ర గాయాలకు గురయ్యాడు. నల్లజర్ల మండలం గంటావారిగూడెంకు చెందిన రాచూరి రాంబాబు ఓ రైతు పొలంలో కోకో కాయలు కోయడానికి శుక్రవారం వెళ్లాడు. ఐరన్ గొట్టంతో వున్న కత్తితో కోస్తుండగా విద్యుత్ వైరుకు తగిలింది. కరెంటు షాక్‌నకు గురై పొట్ట ఎడమ భాగం కాలిపోయింది. తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

కమిషనర్ మందలించారని..

పారిశుధ్య కార్మిక దంపతుల ఆత్మహత్యాయత్నం

నూజివీడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మునిసిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న దంపతులను అందరి ముందు దూషించడంతో మనస్తాపం చెందిన నూజివీడు పురపాలక శానిటరీ మేస్త్రీ దళాయి కొండలరావు, ఆయన భార్య పైడమ్మ శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వీరిని వెంటనే నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో కోలుకున్నారు. పురపాలక వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ఆసుపత్రిలో వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కౌన్సిల్లో చర్చించి చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

కమిషనర్ ఏమన్నారు ?

మున్సిపల్ కమిషనర్‌ను దీనిపై వివరణ కోరగా పారిశుధ్య కార్మికులు సక్రమంగా పనిలోకి రాకపోవడంతో సరైన కారణం చూపకుండా పనికి రాకపోతే తొలగిస్తానని హెచ్చరించాననే తప్ప వారిని దూషించలేదని, పట్టణంలో పారిశుధ్యం క్షీణించడంతో తానే పర్యవేక్షిస్తున్నానని తెలిపారు.

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో వేర్వేరు చోట్ల బైక్‌ల దొంగతనం కేసుల్లో నేరం రుజువు కావడంతో ముగ్గురికి తాడేపల్లిగూడెం న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్టు సీఐ ఆది ప్రసాద్ తెలిపారు. రాజమహేంద్రవరానికి చెందిన మేకల నాగలక్ష్మికి చెందిన బైక్‌ను గత ఏడాది ముంగర సాయిసాగర్ దొంగతనానికి పాల్పడగా ప్రస్తుతం దర్యాప్తు అనంతరం నేరం రుజువైంది. జడ్జి కె.లలిత నిందితుడికి ఐదు నెలల జైలుశిక్ష రూ.1000 జరిమానా విధించారు. తాడేరుకు చెందిన మేకా దుర్గారావు తాడేపల్లిగూడెంలో బంధువుల ఇంటికి వెళ్లి బైక్‌ను పార్క్ చేయగా కృష్ణా జిల్లా పెడనకు చెందిన నామన శ్రీనివాసరావు తస్కరించారు. నేరం రుజువు కావడంతో ఎనిమిది నెలల జైలు, రూ.1000 జరిమానా విధించారు. వీటితో పాటు ఇంటి దొంగతనం, ద్విచక్రవాహనం తస్కరించిన కేసుల్లో గుంటూరుకు చెందిన తిరువీధుల మహేశ్‌కు ఒక్కో కేసులో ఎనిమిది నెలల జైలు, రూ.2వేల జరిమానా విధించినట్టు సీఐ తెలిపారు.

దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తికి లిఫ్ట్ ఇస్తామని మోటారు సైకిల్ ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి దాడిచేసి నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించిన కేసులో ఇద్దరు యువకులను ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కైకలూరు మండలం చింతలమూడు గ్రామానికి చెందిన సాదార్ల బ్రహ్మం హైదరాబాద్ నుంచి ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రైలు దిగి అక్కడ నుంచి అజంతా సెంటర్ వరకు నడిచి వెళ్లారు. అక్కడ ఇద్దరు యువకులు ఏ ఊరు వెళ్లాలని అడిగి తాము కూడా కైకలూరు వెళ్తున్నామని అతడిని ఎక్కించుకున్నారు. ఏలూరు రూరల్ మండలం పోణంగి రోడ్డులో తమ్మిలేరు కాలువ గట్టు ప్రాంతానికి తీసుకెళ్లి అతడిని చితకబాది రూ.5,500 నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌ను అపహరించుకుపోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ వారి సిబ్బంది కలిసి గాలింపు చేపట్టారు. ఈ నేరానికి పాల్పడిన ఏలూరు తూర్పువీధికి చెందిన ఆనంద్‌నగేష్, జంపా పవన్‌కుమార్‌లను శుక్రవారం అరెస్టు చేశారు. వారి ఇద్దరి నుంచి నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.



బాధితుడికి నగదు అందిస్తున్న సైబర్ సీఐ దాస్

ఆన్‌లైన్‌లో మోసపోయిన రూ.89 వేలు అందజేత

బాధితుడికి అందించిన సైబర్ పోలీసులు

ఏలూరు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే ఎక్కువ డబ్బులు వస్తాయని నమ్మి ఒక వ్యక్తి 89 వేల రూపాయలు ఆన్‌లైన్‌లో పెట్టుబడిపెట్టి మోసపోయారు. సైబర్ సెల్‌కు ఇచ్చిన ఫిర్యాదుతో ఆ సొమ్మును రికవరీ చేసి తిరిగి సైబర్ పోలీసులు అందజేశారు. ఏలూరు విద్యానగర్‌కు చెందిన పాల్ దివాకర్ అనే వ్యక్తి ఆన్‌లైన్‌లో వచ్చిన మెసేజ్‌లకు ఆకర్షితులై రూ.89 వేలు పెట్టుబడి పెట్టారు. ఆ తరువాత తాను మోసపోయానని గ్రహించి 1930కు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ దాసు, మహిళా ఎస్ఐ వల్లి పద్మ వారి సిబ్బంది కలిసి దర్యాప్తు చేపట్టారు. బాధితుడు పోగొట్టుకున్న నగదును తిరిగి రికవరీ చేసి శుక్రవారం అందజేశారు.



సదస్సులో మాట్లాడుతున్న మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుబ్బారావు

'శక్తియాప్‌తో పోలీస్ సాయాన్ని పొందవచ్చు'

ఏలూరు క్రైం, జూలై18(ఆంధ్రజ్యోతి): ప్రమాదకర పరిస్థితుల్లో మొబైల్‌లో ఉండే శక్తియాప్‌తో పోలీస్ సాయాన్ని పొందవచ్చని ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు అన్నారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు శ్రీవిద్యాలయ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తియాప్ మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో భద్రత కల్పించేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ రూపొందించిందన్నారు. శక్తియాప్‌లో ఎస్ఓఎస్ బటన్ నొక్కగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని పది నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడకు చేరుకుంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100, 181 హెల్ప్‌లైన్ నంబర్లకు ఈయాప్ నుంచే కాల్ చేయవచ్చన్నారు. వేధింపులు, గృహహింస, కిడ్నాప్ వంటి పరిస్థితుల్లో ఈ యాప్‌ను వినియోగించుకోవచ్చని సూచించారు. త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు మాట్లాడుతూ బాలికలు, మహిళల భద్రతపై పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందన్నారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930కు సమాచారం ఇవ్వాలన్నారు.



కోలనపల్లి చెరువులో మంచినీరు నింపుతున్న దృశ్యం.. చనిపోయిన చేపలు

మంచినీటి చెరువులో చేపలు మృతి

ఆందోళనలో కోలనపల్లి గ్రామస్థులు

కాళ్ల, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాళ్ల మండలం కోలనపల్లి రక్షిత మంచినీటి సరఫరా చెరువులో చేపలు చనిపోవడంపై గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఐదు రోజులుగా చెరువులో చేపలు చనిపోయి నీటిపై తేలడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. నీరు కలుషితంగా మారి చేపలు చనిపోయాయా ? లేక ఆక్సిజన్ అందక చనిపోయాయా ? అనే విషయంపై సందిగ్ధత నెలకొంది. ఇటీవల చెరువుకు నీరు నింపారని, దానివల్లే చేపలు ఈవిధంగా చనిపోతున్నాయా..? ఇదే నీరు తాగుతున్న తమకు ఏమైనా అవుతుందా..? అనే భయం ప్రజల్లో నెలకొంది. చనిపోయిన చేపల వల్ల వచ్చే వాసనతో చెరువు చుట్టూ ఉన్న కుటుంబాలతోపాటు రోడ్డుపై వెళ్లేవారు ముక్కులు మూసుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు తెలిపారు. చెరువు గట్టు చుట్టూ మొలిచిన పిచ్చి మొక్కలతో చిట్టడవిని తలపిస్తుందని విషసర్పాలకు ఆవాసంగా చెరువు గట్టు మారిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో చనిపోయిన చేపలను తొలగించే పనులు చేపడుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణిని వివరణ కోరగా చెరువులో ఉన్న నీరును వెంటనే పూర్తిస్థాయిలో బయటకు మళ్లించి కొత్త నీరు పెట్టాలని పంచాయతీ అధికారులకు సూచించామన్నారు. చెరువు గట్టు చుట్టూ ఉన్న చెత్త, చెదారం పూర్తిస్థాయిలో తొలగించాలని కార్యదర్శికి తెలిపామన్నారు.

రేపు చదరంగం పోటీలు

ఏలూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ చదరంగం డే సందర్భంగా ఈనెల 20వ తేదీన స్థానిక పడమర వీధిలో ఉన్న విజ్ఞాన విహార స్కూల్ ప్రాంగణంలో అండర్-13 విభాగం బాలికలకు చదరంగం పోటీలు, సీనియర్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీలు, ఏలూరు జిల్లా చెస్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు కన్వీనర్ వేల్పూరి వాసుదేవరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టోర్నమెంట్ డైరెక్టర్‌గా లక్కోజు అనిల్, ఆచార్య వ్యవహరిస్తారని తెలిపారు. మరింత సమాచారానికి 95539 87398 నంబరులో సంప్రదించాలన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

జీలుగుమిల్లి, జూలై 18: (ఆంధ్రజ్యోతి): జీలుగుమిల్లి పంచాయతీలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని జీలుగుమిల్లి పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపారు. శుక్రవారం చెత్త సేకరణ రిక్షాకు మైక్ ఏర్పాటు చేసి అపరిశుభ్రత వల్ల కలిగే నష్టాలు, డంపింగ్ యార్డులకు తడి పొడి చెత్త తరలింపు అనంతరం తద్వారా సమకూరే ఆదాయం వంటి అంశాల్ని ప్రచారం చేశారు. అనంతరం గ్రామంలో దోమల లార్వా నివారణకు ట్రాక్టరుతో మలాథియాన్ స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది హెప్సీ, బాలస్వామి ఉన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చింతమనేని

18 దెందులూరు,జూలై 18(ఆంధ్రజ్యోతి): అన్నిశాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు మంచిచేసి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి, ఎంపీపీ బొమ్మనబోయిన సుమలతతో కలిసి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణశాఖ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గృహ లబ్ధిదారులు ఇళ్ల సగంలో నిలిచిపోయిన ప్రస్తుతం ఎవరికి అవసరమో గుర్తించాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, ఏవో శ్రీనివాసరాజు, ఉపాధి హామీ పథకం ఏపీవో ఫాతిమా ప్రసన్న, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రైతు శివాజీ ఆలోచన ఆదర్శనీయం..

దెందులూరు రైతు శివాజీ ఆలోచన ఆదర్శనీయమని, రూ.10కే ఆరోగ్యకరమైన ఆర్గానిక్ భోజనం, ఉచితంగా కూలింగ్ మినరల్ వాటర్ అందిస్తున్నారని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరు ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆర్గానిక్ బియ్యంతో రూచికరమైన భోజనం అందించే కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు పెన్మెత్స త్రినాథరాజు

పదకొండు టీడీపీ వార్డు కమిటీలు ఏకగ్రీవం

జంగారెడ్డిగూడెం,జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఒకటో వార్డు నుంచి పదకొండో వార్డు వరకు టీడీపీ వార్డు కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశామని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ తెలిపారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం కిశోర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి కైకలూరు ఏఎంసీ చైర్మన్‌గా ఎన్నికైన పెన్మెత్స త్రినాథరాజు పట్టణ పరిశీలకుడిగా హాజరయ్యారు. పట్టణ కమిటీలు ఎటువంటి తగాదాలు లేకుండా ఏకగ్రీవంగా ఎంపికవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ల డైరెక్టర్లు నంబూరి రామ చంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, నాయకులు పరిమి సత్తిపండు, రావూరి కృష్ణ, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, మద్దిపాటి నాగేశ్వరరావు, పాతూరి అంబేడ్కర్, చెరుకూరి శ్రీధర్, గుమ్మడి ప్రసాద్, అల్లూరి రామకృష్ణ, తూటిగుంట దుర్గారావు, షేక్ యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 5న స్మార్ట్ మీటర్లను నిరసిస్తూ ధర్నా



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా ఇన్‌చార్జి వనజ

ఏలూరుకార్పొరేషన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 5న అన్ని విద్యుత్ కార్యాలయాల వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తూ ధర్నా నిర్వహిస్తున్నట్టు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, జిల్లా ఇన్‌చార్జి అక్కినేని వనజ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇటీవల ఇసుక, మద్యం మాఫియా పెరిగిపోయాయని, కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు నిలిపివేయాలని కోరుతూ ఇప్పటికే పట్టణ, మండల స్థాయిలో సదస్సులు నిర్వహిస్తున్నామని, ఆగస్టు 5న అన్ని విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. సీపీఐ నాయకులు డేగా ప్రభాకర్, మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాసడాంగే, ఉమాశంకర్, తొర్లపాటి బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులను అభినందించారు.

భారీ వర్షానికి నేలకూలిన విద్యుత్‌స్తంభం



నేలకూలిన విద్యుత్ స్తంభం

టి.నరసాపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని మక్కినవారిగూడెంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్‌స్తంభం నేలకూలింది. స్థానికులు తెలిపిన వివరాలివి.. గురువారం రాత్రి ఒక్కసారిగా భారీవర్షం కురవడంతో మక్కినవారి గూడెం నుంచి టి.నరసాపురం వెళ్లే రోడ్డులో పశువుల ఆసుపత్రి వద్ద ఉన్న విద్యుత్‌స్తంభం నేలకూలింది. ఆ సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పిందని, వర్షం కారణంతో సరఫరా నిలిపివేసి నందున ప్రమాదం తప్పిందన్నారు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో ఆ స్తంభంలో స్థానంలో శుక్రవారం మరోస్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించారని వారు తెలిపారు.

'మార్కెట్ యార్డు చైర్మన్ పదవి ఇవ్వండి'

చింతలపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ పదవి తనకు ఇవ్వాలంటూ జనసేన ఏలూరు పార్లమెంటు సంయుక్త కార్యదర్శి తూము నాగ విజయకుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో అభ్యర్థించారు. తాను ప్రజారాజ్యం, జనసేన పార్టీలలో క్రమశిక్షణతో పనిచేయడమే కాకుండా జిల్లాలో పదవి కూడా నిర్వహించానని, చిరంజీవి యూత్ రక్తదాన సేవా సమితి, బ్లడ్ ఐ సర్వీస్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. 2009లో అసెంబ్లీ ఎన్నికల సమయంలో నియోజకవర్గం జాయింట్ కో-ఆర్డినేటర్‌గా పని చేశానన్నారు. కూటమి విజయానికి ప్రతీ కార్యక్రమంలో పాల్గొంటున్నామన్నారు. తనకు మార్కెట్ యార్డు పదవి ఇస్తే రైతులకు సేవలు అందిస్తానని తెలిపారు.

యువ నైపుణ్య దినోత్సవ పోటీలు

ఏలూరు అర్బన్, జూలై18(ఆంధ్రజ్యోతి):అంతర్జాతీయ యువ నైపుణ్య దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో నిర్వహించారు. బ్రైడల్ మేకప్, మెహందీ, జానపద నృత్యప్రదర్శనలు, పాటల పోటీలు జరిగాయి. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, కామర్స్ హెచ్‌వోడీ సుబ్రహ్మణ్యం, జగదీశ్వరి, హారిక, లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎవరికీ పట్టని.. ఆంధ్రా కాలువ!

(5వ పేజీ తరువాయి)

వేశారు. కాని పనులు చేయలేదు. ఇదిలా ఉంటే యండపల్లికి 200 మీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రా కాలువకు మట్టి పూడ్చి రోడ్డు వేశారు. దీనివల్ల దిగువకు ఒక్క చుక్కనీరు రాదు. ఇదేమని కొందరు ప్రశ్నిస్తే ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు ఆ రోడ్డు తొలగించడానికి వీల్లేదంటూ చెప్పడంతో ఎవరూ సాహసించడం లేదు. ఇది అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడరు. ఆంధ్రా కాలువ చానల్ పర్యవేక్షించడానికి రాఘవాపురంలో ఏఈ కార్యాలయం ఉంది. అధికారి ఉన్నారు. కాని ఒక్క రోజు కూడా కార్యాలయానికి రారు. ఆయన నివాసం ఏలూరు. ప్రభుత్వం జీతం ఏ విధంగా ఇస్తోందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే నీరు ఎలాగూ రావడం లేదంటూ రాఘవాపురం, గణిజర్ల పరిసరాల్లో కొందరు కాలువ గట్లను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆంధ్రా కాలువకు సాగునీరు రావాలంటే తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి పూడికలు, ఆక్రమణలు తొలగించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. కాగా సీతారామ ప్రాజెక్టు తెలంగాణలో పూర్తయితే దాని నీరు బేతుపల్లి చెరువుకు వస్తుంది కనుక మంచి పరిష్కారం దొరుకుతుందని రైతులు భావిస్తున్నారు.



ఏలూరులో ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చంటి.. పైడి చింతపాడులో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు.. పోలసానపల్లిలో చెత్త నుంచి సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

ప్రజా సహకారంతో సుస్థిర పాలన

- ఎమ్మెల్యే బడేటి చంటి
- 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాలు

ఏలూరుటూటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రజాసహకారంతో సుస్థిర పాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఏలూరు 39వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణం కనిపిస్తుందన్నారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా అర్హులందరికి అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలనపై ప్రజలు అవగాహన పెంచుకుని వారికి రావాల్సిన హక్కులను సాధించుకోవాలన్నారు. రాబోయే నాలుగేళ్లలో మరిన్ని పథకాలు అమలు చేస్తామన్నారు. ఈడా చైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ పార్థసారథి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టీడీపీ నగర అధ్యక్షుడు చోడే వెంకటరత్నం, కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పలివెల లవకిషోర్, తదితరులు పాల్గొన్నారు.

● ఏలూరురూరల్/దెందులూరు: గత వైసీపీ హయాంలో అక్రమంగా ప్రజాధనాన్ని దోపిడీచేసిన వ్యక్తులు ఎక్కడ దాక్కున్నా వారిపై చర్యలు తీసుకుని ప్రజాధనం రికవరీ చేస్తామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్పష్టం చేశారు. ఏలూరురూరల్ మండలం పైడి చింతపాడు గ్రామంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రేలంగి యోహాను, మాజీ సర్పంచ్ ఏళ్ల భూషణ్‌రాజు సహా దాదాపు యాభై కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం నాయకుల ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే చింతమనేని పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. దెందులూరు నియోజకవర్గంలోని కొండలరావుపాలెం గ్రామంలో టీడీపీ నాయకులు పాడుగు నరసింహారావుతో కలిసి సుపరిపాలనపై తొలిఅడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ నిర్వహించారు. రాట్నాలకుంటలో రాట్నాలమ్మ ఆలయ దేవస్థానం చైర్మన్ మన్నే శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి అనిల్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

● భీమడోలు : గత ప్రభుత్వంలో అస్త వ్యస్తంగా మారిన వ్యవస్థల బలోపేతానికి ప్రస్తుత ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. 'పల్లెపల్లెకు పత్సమట్ల' కార్యక్రమంలో భాగంగా పోలసానపల్లి, భీమడోలు గ్రామాల్లో పర్యటించిన ఆయన గ్రామంలో మరమ్మతులు చేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సర్పంచ్ షేక్ హసీనా రహీమాబేగం పాల్గొన్నారు. అనంతరం భీమడోలులో పర్యటించిన ఆయన ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంత మార్కెట్‌లో నాబార్డ్ సహకారంతో చైతన్య యువజన సంఘం నిర్మించిన మార్కెట్ షెడ్‌ను ప్రారంభించారు. నాబార్డ్ డీడీఎం అనిల్ కాంత్, జడ్పీటీసీ టి.భవానీ, సర్పంచ్ పాము సునీత, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీవో పద్మావతిదేవి పాల్గొన్నారు.



డెంగీపై వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ

డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

లింగపాలెం, జూలై18(ఆంధ్రజ్యోతి): డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ధర్మాజీగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. ధర్మాజీగూడెంలో శుక్రవారం డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈమె మాట్లాడుతూ ఆర్బోవైరస్ (టైగర్‌దోమ) తరగతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి సోకుతుందన్నారు. ఈ దోమలు ఇంటి ఆవరణలలో, ఇళ్లలో ఉండి పగలు మాత్రమే కుడతాయన్నారు. దోమల బారిన పడకుండా దోమతెరలు వాడాలన్నారు. సిబ్బంది ప్రతిరోజూ గ్రామాలలో పర్యటించి అవగాహన కల్పించాలన్నారు. ఎస్.ప్రసాద్, రామ్మోహన్‌రావు, పార్థసారథి, రాణి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న రెడ్డి అప్పలనాయుడు

జనసేన 17వ డివిజన్ కమిటీ నియామకం

ఏలూరు రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): స్థానిక 17వ డివిజన్ జనసేన పార్టీ నూతన కమిటీని శుక్రవారం నియమించారు. డివిజన్ ఇన్‌చార్జిగా లక్కింశెట్టి కిరణ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడిగా సుంకర శ్రీధర్, ఉపాధ్యక్షులుగా చాగంటి దుర్గాపవన్, సుంకర లక్ష్మణరావు, సెక్రటరీగా గోవాడ ద్వారక, ట్రెజరర్ బడే రాజారావు, సమన్వయకర్తగా సముద్రాల కృష్ణమోహన్, అధికార ప్రతినిధులుగా మెరుపు నాగరాజు, పోలిశెట్టి రాజేష్, జాయింట్ సెక్రటరీగా రామినేని నాని, జంగా గోపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పసుపులేటి రాజా, ప్రచార కార్యదర్శిగా వల్లూరి వంశీకృష్ణ, ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జనసేన పార్టీ కార్యాలయంలో ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కమిటీని అభినందించారు.



రైతులకు విత్తనాలు అందిస్తున్న అధికారులు

'చిరు ధాన్యాల సాగుతో అధిక ఆదాయం'

పోలవరం, జూలై 18(ఆంధ్రజ్యోతి) : చిరు ధాన్యాల సాగుతో పెట్టుబడులు తగ్గి, అధిక దిగుబడులు సాధించవచ్చని ఏలూరు జిల్లా ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె ఫణికుమార్ సూచించారు. శుక్రవారం వింజరం సచివాలయ రైతు సేవా కేంద్రంలో ఏవో కె.రాంబాబు ఆధ్వర్యంలో రైతులకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగుచేసే రైతులు తమ వివరాలు అందిస్తే వారికి కావలసిన విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. ఎక్స్‌టెన్షన్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.నాగేంద్రబాబు మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపే రైతులకు ప్రభుత్వం ఉచితంగా ఎరువులు, పురుగు మందులు అందిస్తామని, తద్వారా రైతులకు పెట్టుబడులు తగ్గి ఆదాయం పెరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మినుము పంట రకాలు లక్షణాలు, మొక్కజొన్న పంటపై కత్తెర పురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. జాతీయ ఆహార భద్రత పోషక మిషన్ పథకంలో 50శాతం రాయితీపై మినుము విత్తనాలు సర్పంచ్ కొక్కెర వెంకటలక్ష్మి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

పెదపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల జరిగే ప్రమాదాల వల్ల ప్రాణనష్టం జరుగుతుందని పెదపాడు ఎస్ఐ కట్టా శారదా సతీష్ తెలిపారు. జాతీయరహదారిపై కలపర్రు టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలను శుక్రవారం నిర్వహించారు. పలు వాహనాలను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నదీ లేనిది తనిఖీలు నిర్వహించారు. వాహనదారులకు ఈ-చలానా రూపంలో జరిమానాలు విధించారు. ఎస్ఐ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా, మద్యం సేవించి వాహనాలను నడపటం వల్ల వారికే కాకుండా తోటివారికి ప్రమాదం సంభవిస్తుందన్నారు. తనిఖీల్లో స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నల్ల రిబ్బన్లతో విధులకు హాజరైన మునిసిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది

నల్ల రిబ్బన్లతో ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

చింతలపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి):స్థానిక మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శుక్రవారం నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఇంజనీరింగ్ సిబ్బంది కార్మికులను గత ప్రభుత్వం సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను ఈ ప్రభుత్వంలో నేటివరకు అమలు చేయకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజుల నుంచి చింతలపూడి మునిసిపాలిటీలోని వాటర్ వర్క్స్ సిబ్బంది నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తే సమ్మెలోకి వెళ్తామని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్, సీఐటీయూ చింతలపూడి యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నాగరాజు, టి.విజయరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రదర్శనలో యూనియన్ నాయకులు ఎం.డి.సలీం, ఎం.సత్యం, నాగరాజు పాల్గొన్నారు.

'సుఖీభవ పథకంపై రైతుల ఫిర్యాదులు పరిష్కరించండి'



ఎస్‌బీఐ మేనేజర్‌తో జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా

చింతలపూడి, జూలై18(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించబోతోందని, సంబంధిత గ్రీవెన్స్‌లో రైతుల ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా సూచించారు. శుక్రవారం వ్యవసాయశాఖ, చింతలపూడి సబ్ డివిజన్‌లోని రైతు సేవా కేంద్రాల సిబ్బంది. నాలుగు మండలాల వ్యవసాయాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. కౌలు రైతు కార్డులు ఇవ్వాలని, రుణాలు ఇప్పించాలని, క్రాప్ ఇన్సూరెన్స్ కట్టించాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ మేనేజర్‌ను కలిసి రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ఏవో మురళీ, ప్రదీప్‌కుమార్, ప్రియంక, ప్రసూన, వ్యవసాయ శాఖ సంచాలకులు వై.సుబ్బారావు పాల్గొన్నారు.



విద్యార్థులు ప్యాడ్‌లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన దృశ్యాలు

విద్యార్థులకు ప్యాడ్‌లు, నోట్ పుస్తకాల పంపిణీ

చింతలపూడి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రోత్సాహకంగా స్థానిక మేడబడి విద్యార్థులకు రమేష్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బోదల రామారావు, శ్రీను మాట్లాడుతూ ఇక నుంచి ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థులను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందిస్తామని ప్రకటించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు.

ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో..

లింగపాలెం : విద్య వల్ల సమాజంలో ప్రత్యేక గుర్తింపు వస్తుందని ప్రతి విద్యార్థి చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని ట్రేస్ ఇండియా స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ దిడ్ల యాంజిలో అన్నారు. సింగగూడెం మోడల్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఎంఈవోలు కె.రామారావు, జె.రవీంద్ర, సర్పంచ్ బొంతు రామారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని కోరారు. జీజేఏ స్టీఫెన్, ముస్తాఫ్‌ఆలీ, హెచ్‌ఎం, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, ఉపాధ్యాయులు అంజలీదేవి, అప్పారావు, విజయరేఖ విద్యార్థులు పాల్గొన్నారు.



కామవరపుకోటలో ఆషాఢ సారె.. మాదేపల్లిలో శాకంబరీగా భ్రమరాంబిక అమ్మవారు

అమ్మవార్లకు పూజలు

కామవరపుకోట/పోలవరం/ఏలూరు కార్పొరేషన్/ఏలూరు రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కామవరపుకోటలో శ్రీలక్ష్మీహయగ్రీవ లలితా పీఠంలోని అమ్మవారికి 108 రకాల ఆహార పదార్థాలతో ఆషాఢ సారెను భక్తులు సమర్పించారు. ఈ ప్రక్రియను స్థానిక కాకి గోపాలరావు, నారాయణరావు నివాస గృహం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లలితా పీఠానికి చేరుకుని ఆషాఢ సారె సమర్పించారు. పోలవరం మండలం పట్టిసీమ పంచాయతీ బంగారమ్మపేట కనకదుర్గ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు 108 కలశాల గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఏలూరు-సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మీదేవి ఆలయంలో ఆషాడ శుక్రవారం కావడంతో అర్చకులు ఊటుకూరి నాగేశ్వరశర్మ మహిళలతో సామూహికంగా రాహుకాల శ్రీచక్ర కుంకుమార్చన పూజలు జరిపించారు. ఏలూరురూరల్ మండలం మాదేపల్లిలో అగస్త్య మహాముని ప్రతిష్ఠించిన శ్రీభ్రమరాంబిక సహిత అమ్మవారిని శాకంబరీగా అలంకరించారు.

రాష్ట్రానికి నిధులు సమకూరుస్తా : ఎంపీ



ఏలూరుటూటౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి సంబంధించిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్రం నుంచి నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ తెలిపారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభలో ప్రస్తావించాల్సిన అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు ఏర్పాటు చేసిన టీడీపీ పార్లమెంటరీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఈనెల 21నుంచి జరిగే వర్షాకాల సమావేశంలో సీఎం సూచనల మేరకు కేంద్రం నుంచి రాష్ట్రాభివృద్ధికి, సంక్షేమానికి అవసరమైన నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

ఏలూరుటూటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం 16, 17వ డివిజన్లలో ప్లాస్టిక్ కాలుష్యం, నిర్మూలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు. ప్రతీనెల మూడో శనివారం నగరంలో స్వచ్ఛంధ్ర, స్వచ్ఛదివాస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

మానవ అక్రమ రవాణా వ్యతిరేక పోస్టర్ విడుదల

ఏలూరు అర్బన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినం పోస్టర్లను శుక్రవారం ఏలూరు రైల్వేస్టేషన్లో ఆర్పీఎఫ్ పోస్టు కమాండర్ కె.బెనయ విడుదల చేశారు. ఈనెల 30 వరకు రైళ్లలో రెస్క్యూ ఆపరేషన్లను నిర్వహిస్తామన్నారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వరకు ప్రత్యేక తనిఖీలను చేపట్టారని చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఆర్పీఎఫ్ ఎస్ఐ బి.రాజు, జీఆర్పీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం క్రైస్తవ జేఏసీ అధ్యక్షుడిగా ఎజ్రాశాస్త్రి

జీలుగుమిల్లి, జూలై 18:(ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గ క్రైస్తవ జేఏసీ అధ్యక్షుడిగా పాస్టర్ బి.ఎజ్రాశాస్త్రి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. శుక్రవారం జీలుగుమిల్లిలో నియోజకవర్గ స్థాయి పాస్టర్ల సమావేశం నిర్వహించారు. క్రైస్తవ మతంపై జరిగే దాడులు ఖండిస్తూ, భిన్నత్వంలో ఏకత్వం గల దేశంలో మత సామరస్యాన్ని కాపాడాల్సిన బాధ్యత అన్ని మతాలకు ఉందని ఆయన సూచించారు. ఏడు మండలాల పాస్టర్ల ఆధ్వర్యంలో జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎం.నిరీక్షణరావు, గౌరవ అధ్యక్షుడిగా ఎం.దేవసహాయం, డానియేల్ రెవా.కె.భరత్, చైర్మన్‌లు సీహెచ్.స్టీఫెన్, ఎ.డేవిడ్‌రాజు, ఇతర సభ్యులు టి.పాటిల్, బి.జయరాజు, టి.జాన్‌విల్సన్ ఉన్నారు.



గుర్వాయిగూడెంలో రోడ్డుపక్కన బస్సు

గుర్వాయిగూడెంలో మొరాయించిన బస్సు

జంగారెడ్డిగూడెం,జూలై 18 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై మండలంలోని గుర్వాయిగూడెంలో నిలిచి పోయింది. ఆర్టీసీ డీఎం గంగాధరరావు మరో బస్సును పంపించి ప్రయాణికులను ఏలూరు చేరవేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ నిలిచిపోయిన బస్సును ఇటీవల విధుల్లో చేరిన అవుట్ సోర్సింగ్ డ్రైవర్ నడుపుతుండగా గుర్వాయిగూడెం వెళ్లేసరికి బ్రేకులు సరిగా పనిచేయడం లేదని సమాచారం అందించగా ఆర్టీసీ డిపో మెకానిక్ సిబ్బందిని పంపి బస్సును వెనక్కి రప్పించామని, కండీషన్ బాగుందని ఆ బస్సును వేరే రూట్‌కు పంపినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన బస్సులు తరచూ మరమ్మతులకు గురవుతుండడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి | నూజివీడు | నూజివీడు, కైకలూరు
7 | www.andhrajyothy.com | ● శనివారం 19 జూలై 2025

ఆగిరిపల్లి ఇన్‌చార్జి ఎంఈవో-1గా కె. రామారావు



ఆగిరిపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల ఇన్‌చార్జి విద్యాశాఖ అధికారి-1గా కె. రామారావు నియమితులయ్యారు. గత నెలలో పదవీ విరమణ చేసిన కే. సర్వేశ్వరరావు స్థానంలో ఏలూరు జిల్లా, లింగపాలెం మండలం విద్యాశాఖ అధికారి-1గా పనిచేస్తున్న కె రామారావుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించామని జోన్-2 పాఠశాల విద్యా ప్రాంతీయ సంచాలకులు జి నాగమణి తెలిపారు.

ఉర్దూ పాఠశాల తనిఖీ

ముదినేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంకర్షణపురం ఉర్దూ పాఠశాలను ఎంఈవో-2 కె నరేష్ కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు ఉర్దూ పాఠ్యాంశాల బోధనపై హెచ్ఎం రఫుల్లాతో చర్చించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని ఎంఈవో తెలిపారు.

కమిషనర్ మందలించారని పారిశుధ్య కార్మిక.. దంపతుల ఆత్మహత్యాయత్నం

నూజివీడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న భార్యభర్తలను అందరి ముందు దూషించారని మనస్తాపం చెందిన నూజివీడు పురపాలక శానిటరీ మేస్త్రీ దళాయి కొండలరావు, ఆయన భార్య పైడమ్మ శుక్రవారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు వీరిని వెంటనే నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే చికిత్స అందడంతో వీరు కోలుకున్నారు. పురపాలక వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ఆసుపత్రిలో వీరిని పరామర్శించి ధైర్యం చెప్పారు. కౌన్సిల్లో చర్చించి తగు చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

కమిషనర్ ఏమన్నారు?

కాగా మున్సిపల్ కమిషనర్‌ను దీనిపై వివరణ కోరగా పారిశుధ్య పనివారలు సరిగా పనిలోకి రాకపోవడంతో సరైన కారణం చూపకుండా పనిలోకి రాకపోతే తొలగిస్తానని హెచ్చరించాననే తప్ప వారిని దూషించలేదని, పట్టణంలో పారిశుధ్యం క్షీణించడంతో తానే పర్యవేక్షిస్తున్నానని తెలిపారు.



సాగు భూములకు పట్టాలివ్వాలి

ముసునూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో సాగుదారులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య మాట్లాడుతూ రమణక్కపేటలో సర్వే నంబరు 266-2, 1-1, 4-33లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు చెందిన పేదలు మూడు తరాలుగా వందల ఎకరాలు అటవీ భూములు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. ఈ భూములలో మామిడి, పెసర, కంది, మొక్కజొన్న మొదలైన పంటలు సాగు చేస్తుండగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పరిహారం అందటం లేదని, ఇంకా రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ అందక నష్ట పోతున్నారన్నారు. ఈ భూముల్లో 1969లో సెక్షన్ 4 నోటిఫికేషన్ విధించటం జరిగిందని, జాయింట్ కలెక్టర్ పరిశీలించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకుంటే ఈ నెల 21న ముసునూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. నాయకులు ఆముదాల చిన బాబు, వేముల చంటి, బేబీశాలిని, భవాని, రాణి తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ మొక్కలు ఉచితంగా అందిస్తాం

చాట్రాయి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ విస్తీర్ణ పథకం కింద రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేయటంతో పాటు, నాలుగేళ్ల ఎరువుల నిర్వహణ, అంతర్ పంటల సాగుకు 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ఉద్యానశాఖ అధికారిణి ఆర్. హేమ అన్నారు. బూరుగుగూడెంలో పామాయిల్ మెగా ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా ఉద్యాన శాఖ, గోద్రెజ్ కంపెనీ ఆధ్వర్యంలో శుక్రవారం పామాయిల్ సాగులో పాటించవలసిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహనా సమావేశం నిర్వహించారు. గోద్రెజ్ కంపెనీ చాట్రాయి మేనేజర్ ఉమా శ్యామ్, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌వో

రైతులకు ఉచితంగా మామిడి మొక్కల పంపిణీ

చాట్రాయి, జూలై 18(ఆంధ్రజ్యోతి): పీఎస్పీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని రైతులకు శుక్రవారం 2 వేల మామిడి మొక్కలు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి ఆదిమాలం హేమంత్ మాట్లాడుతూ సొంత భూమి ఉన్న రైతులకు పరిమితి లేకుండా మామిడి మొక్కలు అందజేస్తామని, మొక్కలు కావల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో తమని సంప్రదిస్తే ఆన్‌లైన్ చేసి మొక్కలు అందజేస్తామన్నారు. మామిడి తోటలు అంతరించకుండా కాపాడి, పచ్చదనాన్ని పెంచాలని, రాబోయే తరాలకు మామిడి పంటను అందించాలనే ఉద్దేశ్యంతో, తమ సంస్థ ఉచితంగా మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్నదని, మొక్కలు జాగ్రత్తగా సంరక్షించాలని కోరారు.



రైతులకు మొక్కలు పంపిణీ చేస్తున్న దృశ్యం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు అభినందన

చాట్రాయి, జూలై 18(ఆంధ్రజ్యోతి): నూజివీడు ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన బీజేపీ నాయకురాలు కుంపటి అరుణను, మండల బీజేపీ నాయకులు బుర్రి శ్రీకర్ తదితరులు శుక్రవారం ఏలూరు పార్టీ కార్యాలయంలో కలిసి అభినందించారు. ఉన్నత విద్యావంతురాలైన అరుణ సారధ్యంలో నూజివీడు మార్కెట్ కమిటీ అభివృద్ధి జరిగి రైతులకు మేలు జరుగుతుందని శ్రీకర్ ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎవరికీ పట్టని.. ఆంధ్రా కాలువ!

(5వ పేజీ తరువాయి)

వేశారు. కాని పనులు చేయలేదు. ఇదిలా ఉంటే యండపల్లికి 200 మీటర్ల దూరంలో ఉన్న ఆంధ్రా కాలువకు మట్టి పూడ్చి రోడ్డు వేశారు. దీనివల్ల దిగువకు ఒక్క చుక్కనీరు రాదు. ఇదేమని కొందరు ప్రశ్నిస్తే ఆ గ్రామానికి చెందిన వ్యక్తులు ఆ రోడ్డు తొలగించడానికి వీల్లేదంటూ చెప్పడంతో ఎవరూ సాహసించడం లేదు. ఇది అధికారులకు తెలిసినా కన్నెత్తి చూడరు. ఆంధ్రా కాలువ చానల్ పర్యవేక్షించడానికి రాఘవాపురంలో ఏఈ కార్యాలయం ఉంది. అధికారి ఉన్నారు. కాని ఒక్క రోజు కూడా కార్యాలయానికి రారు. ఆయన నివాసం ఏలూరు. ప్రభుత్వం జీతం ఏ విధంగా ఇస్తోందని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉంటే నీరు ఎలాగూ రావడం లేదంటూ రాఘవాపురం, గణిజర్ల పరిసరాల్లో కొందరు కాలువ గట్లను ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వీటిని పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఆంధ్రా కాలువకు సాగునీరు రావాలంటే తెలంగాణ ప్రభుత్వంతో చర్చించి పూడికలు, ఆక్రమణలు తొలగించాలి. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలి. కాగా సీతారామ ప్రాజెక్టు తెలంగాణలో పూర్తయితే దాని నీరు బేతుపల్లి చెరువుకు వస్తుంది కనుక మంచి పరిష్కారం దొరుకుతుందని రైతులు భావిస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

కలుషిత నీరే దిక్కు!

- దాహంతో అల్లాడుతున్న కొండంగి, మట్టగుంట గ్రామస్థులు
- వాడకానికీ పనికిరాదని ఆవేదన





కొండంగి, మట్టగుంట గ్రామాల్లో కలుషితమైన తాగునీటి చెరువులు

కలిదిండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొండంగి, మట్టగుంట గ్రామాల్లో తాగునీటి చెరువుల నీరు రంగు మారి కలుషితమైంది. దీంతో చెరువుల్లో నీరు తీవ్ర దుర్వాసన వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. ఇవి వాడుకోవటానికి కూడా ఉపయోగపడడం లేదని స్నానాలు చేస్తే దురదలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువుల్లో నీరు తాగటానికి పనికిరాక లేకపోవటంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌లలో బిందెడు నీరు రూ.10 చొప్పున కొనుగోలు చేసి తాగుతున్నామని వాపోతున్నారు. స్థోమత లేని పేదలు కలుషిత నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు క్లోరినేషన్ చేసినా ప్రయోజనం కనిపించటం లేదు.

ఈ విషయమై కొండంగి సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, మట్టగుంట సర్పంచ్ అంద్రాజురత్న మణిను వివరణ కోరగా, తాగునీటి చెరువుల్లో రంగు మారిన కలుషిత నీటిని పూర్తిగా తొలగించి చెరువు అడుగు భాగంలో సున్నం, బ్లీచింగ్ చల్లిస్తామన్నారు. తాజా నీటితో చెరువులను నింపటానికి చర్యలు తీసుకుంటామన్నారు. తాగునీటి వంతు ఇస్తే పూర్తిస్థాయిలో చెరువులను నింపుతామన్నారు.

రక్షిత మంచినీటి పథకానికి నిధుల కేటాయింపు

కైకలూరు, జూలై 18(ఆంధ్ర జ్యోతి): కైకలూ రు రక్షిత మంచి నీటి పథకం అభివృద్ధికి రూ. 32 లక్షలు నిధులను కేటాయించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రక్షిత మంచినీటి పథకాలకు ఒక్క రూపాయి నిధులు కూడా కేటాయించకపోవడంతో అవి పూర్తిగా మరుగున పడ్డాయి. రక్షిత మంచినీటి పథకం ద్వారా ప్రజలకు శుద్ధి చేయని నీరే సరఫరా అయ్యేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నూతనంగా మైక్రో వాటర్ ఫిల్టర్ నిర్మాణానికి రూ.17 లక్షలు, ర్యాపిడ్ సాండ్ ఫిల్టర్ మరమ్మతుల కోసం రూ.15 లక్షల నిధులు కేటాయించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. వీటి పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాస్ తెలిపారు.



ర్యాపిడ్ ట్యాంక్ ఫిల్టర్

సుపరిపాలనతోనే సంక్షేమం, అభివృద్ధి



కరపత్రాలు అందజేస్తున్న నాయకులు

ఆగిరిపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తోటపల్లిలో నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పథకాల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. పీఏసీఎస్ అధ్యక్షులు పరిమి శోభనాద్రి, టీడీపీ నాయకులు వల్లూరి ప్రదీప్‌కుమార్, ఆరేపల్లి సాయికృష్ణ, పామర్తి రాంబాబు, పామర్తి శివ, బసవ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ఆగిరిపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో బి. భార్గవి అన్నారు. 18 ఎంపీటీసీలకు గాను ఆరుగురు సమావేశానికి హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాకపోవడంతో అధికారులంతా వెనుదిరిగారు. సర్వసభ్య సమావేశం ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామని ఎంపీడీవో తెలిపారు.

రైతులకు అండగా ఉంటాం..

నూజివీడు, జూలై 18(ఆంధ్రజ్యోతి): నూజివీడు హార్టికల్చర్ రైతు ఉత్పత్తిదారుల సంస్థ సర్వసభ్య సమావేశం శుక్రవారం నూజివీడు మండలం కొత్తూరు తండా గ్రామంలో జరిగింది. ఈ సంస్థ ద్వారా రైతులకు తక్కువ ధరలో వ్యవసాయ పనిముట్లు, సాంకేతిక సలహాలు, మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సంస్థ డైరెక్టర్లు సమావేశంలో నిర్ణయించారు. అలాగే విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు లైసెన్స్‌ల కోసం ప్రభుత్వ సహకారంతో రైతులకు ఈ సేవలు కూడా అందించాలని నిర్ణయించారు. సర్పంచ్ ఎం శ్రీను, సిఎస్ఐ సంస్థ మార్కెటింగ్ కోఆర్డినేటర్ భరత్, తదితరులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఉత్తమ పౌరులుగా ఎదగాలి

ట్రిపుల్ ఐటీలో ఫస్టియర్ విద్యార్థులకు పలు సూచనలు

నూజివీడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్, మత్తు పదార్థాల వినియోగంతో జరిగే నష్టాలు, సైబర్ నేరాలపై నూజివీడు ట్రిపుల్ ఐటీలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. నైతిక విలువలు పాటించి ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ పౌరులుగా తయారు కావాలని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ అవుట్ పోస్ట్ ఇన్‌చార్జీ కే రాంబాబు విద్యార్థులకు సూచించారు. క్యాంపస్‌లోని పోస్ట్ ఆఫీస్, ఎస్‌బీఐ సిబ్బంది పొదుపు పథకాలు, బీమా సౌకర్యాలపై అవగాహన కల్పించారు. అలాగే క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్ వైద్యులు ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఉదయం నూజివీడు క్యాంపస్ విద్యార్థులకు మధ్యాహ్నం ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులకు ఈ అవగాహన కార్యక్రమం జరిగింది.



లావల డ్రెయిన్ పూడికతీత పనులు ప్రారంభం

కలిదిండి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కలిదిండిలో శుక్రవారం రూ.28.5 లక్షలతో చేపట్టిన లావల డ్రెయిన్ పూడికతీత పనులను కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణలు ప్రారంభించారు. ఉప్పుటేరు వద్ద నుంచి తామరకొల్లు వరకు సుమారు 11.6 కిలోమీటర్ల మేర లావల డ్రెయిన్‌లో పూడికను ఎక్స్‌కవేటర్‌తో తొలగించటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. లావల డ్రెయిన్ పూడుకుపోవటంతో పొలాలు కొద్దిపాటి వర్షానికే ముంపుకు గురికావటంతో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చొరవతో డ్రెయిన్ పూడికతీత పనులు చేపట్టామన్నారు. డ్రైనేజీ ఏఈఈ వెంకట్రామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు ఇమ్మానేని చంద్రశేఖర్, నీటి సంఘం మాజీ అధ్యక్షుడు ఎం.మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

త్రినాథరాజుకు అభినందన

కైకలూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కైకలూరు వ్యవసాయ మార్కెట్‌యార్డ్ చైర్మన్‌గా టీడీపీ నాయకుడు పెన్మెత్స త్రినాదరాజును ప్రకటించడంతో పలువురు టీడీపీ నేతలు ఆయనను అభినందించారు. యువ నాయకుడు నారా లోకేశ్ ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఇస్తానని చెప్పినట్లుగానే కైకలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా త్రినాధరాజును ప్రకటించినట్లు పలువురు నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ పీజేఎస్ మాల్యాద్రి, టీడీపీ నేతలు పి. రాధాకృష్ణ, ఎండీ జానీ, బాజానీ, నియోజకవర్గ రజకసేవా సంఘం నాయకులు కంచర్ల రామకృష్ణ, శ్రీలంక శ్రీనివాసరావు, జి చంటి, అంతర్వేది పెద్దిరాజులు, జనసేన నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి అభినందనలు తెలిపారు.



దారి దోపిడీ కేసులో ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తికి లిఫ్ట్ ఇస్తామని మోటారు సైకిల్ ఎక్కించుకుని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకువెళ్లి దాడిచేసి నగదు, సెల్‌ఫోన్‌ను అపహరించిన కేసులో ఇద్దరు యువకులను ఏలూరు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. కైకలూరు మండలం చింతలమూడు గ్రామానికి చెందిన సాదార్ల బ్రహ్మం హైదరాబాద్ నుంచి ఈనెల 13వ తేదీ తెల్లవారుజామున ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రైలు దిగి అక్కడ నుంచి అజంతా సెంటర్ వరకు నడిచి వెళ్లారు. అక్కడ ఇద్దరు యువకులు ఏ ఊరు వెళ్లాలని అడిగి తాము కూడా కైకలూరు వెళ్తున్నామని అతడిని ఎక్కించుకున్నారు. ఏలూరు రూరల్ మండలం పోణంగి రోడ్డులో తమ్మిలేరు కాలువ గట్టు ప్రాంతానికి తీసుకెళ్లి అతడిని చితకబాది రూ.5,500 నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌ను అపహరించుకు పోయారు. ఈ ఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు రూరల్ ఎస్ఐ సీహెచ్ దుర్గా ప్రసాద్ వారి సిబ్బంది కలసి గాలింపు చేపట్టారు. నేరానికి పాల్పడిన ఏలూరు తూర్పు వీధికి చెందిన ఆనంద్‌నగేష్, జంపా పవన్‌కుమార్‌లను శుక్రవారం అరెస్టు చేసి వారి ఇద్దరి నుంచి నగదు, సెల్‌ఫోన్, బ్యాగ్‌లను స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించడంతో జిల్లా జైలుకు తరలించారు.

అల్లుడిపై మామ దాడి

ముదినేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో అల్లుడిపై అత్తింటి వారు దాడి చేసి తీవ్ర గాయాలకు గురి చేసిన సంఘటన ఇది. ముదినేపల్లి మండలం కాకరవాడ గ్రామంలో ఈడే బలాజీ అనే వ్యక్తికి కొన్నేళ్ళ క్రితం అదే గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. మనస్పర్థల కారణంగా కొంతకాలంగా వీరు వేర్వేరుగా ఉంటున్నారు. బాలాజీ కిరాణా వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఈ నెల 15న షాపు దగ్గరకు వచ్చి బాలాజీతో అతని మామ, బావమరుదులు నాగబాబు, వర ప్రసాద్, మహేష్ ఘర్షణకు దిగారు. ఇనుపరాడ్లు, కర్రలతో బాలాజీపై దాడి చేశారు. వెంటనే అతనిని స్థానికులు గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ఆ ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరరావు దర్యాప్తు చేస్తున్నారు.



ముదినేపల్లిలో తగ్గిన జన సంచారం

అక్కడ ఎండ.. ఇక్కడ వాన

ముదినేపల్లి/కైకలూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో శుక్రవారం వేసవిని తలపించేలా వేడి గాలులు వీచాయి. రహదార్లు బోసిపోయాయి. ముదినేపల్లిలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయినట్లు తెలిసింది. ఇక కైకలూరులో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసి రహదారులన్నీ జలమయమయ్యాయి. కైకలూరు ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలో రహదారిపై నీరు నిలిచిపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఆ నీటిలోనే రాకపోకలు సాగించారు.





ట్రాన్స్‌ఫార్మర్ చెంత ప్లాస్టిక్ వ్యర్థాలను మేస్తున్న మూగజీవాలు

గౌతమ బుద్ధా.. క్షమించు

బుద్ధుని చిత్రం ఎదుట, ట్రాన్స్‌ఫార్మర్ పక్కన పేరుకున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

వాటినే మేస్తున్న మూగజీవాలకు పొంచి ఉన్న ప్రమాదం

నూజివీడు టౌన్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మౌనముద్రలో ఉన్న గౌతమ బుద్ధుడి ఛాయాచిత్రాన్ని నూజివీడు గరల్స్ హైస్కూల్ వద్ద చిత్రీకరించారు. అయితే ఆ చిత్రానికి ఎటువంటి విలువ లేకుండా ఆ ప్రదేశాన్ని ఇదిగో ఇలా చెత్తబుట్టలా స్థానికులు మార్చివేశారు. మరోవైపు ఆ ప్రదేశంలో ట్రాన్స్ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ ఏర్పాటు చేసింది. ఇదేమీ పట్టని మూగజీవాలు తమ ఆకలి తీర్చుకునేందుకు ట్రాన్స్ఫార్మర్, ప్లాస్టిక్ వ్యర్థాల రూపంలో పొంచి ఉన్న ప్రమాదాలను పట్టించుకోకుండా ఇదిగో ఇలా ఆహారాన్ని తీసుకుంటున్నాయి. రెండు నిర్లక్ష్యాలు ఆ మూగజీవాల పాలిట రెండు ప్రమాదాలుగా మారుతున్నాయి. ఓ బుద్ధ భగవాన్ ఈ సంఘాన్ని మార్చవా..

చికిత్స పొందుతూ మహిళ మృతి

మండవల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): బాబా ఆలయానికి వెళ్లిన మహిళ చీరకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండవల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గుడివాడ తాయారమ్మ(60) ప్రతి గురువారం బాబా గుడికు వెళ్లి పూజలు చేస్తుంటుంది. ఈ క్రమంలో ఈ నెల 10న గురుపౌర్ణమి నాడు గుడికి వెళ్లి పూజలు చేస్తున్న క్రమంలో ఆమె చీరకు ప్రమాదవశాత్తు దీపం అంటుకుని తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి భక్తులు మంటలను ఆర్పి చికిత్స నిమిత్తం ఏలూరు లోని ఆశ్రం ఆసుపత్రిలో చేర్పించగా వైద్య సేవలు పొందుతూ 17న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ భద్రం కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

సారె సమర్పణ



ఆరుగొలనుపేటలో సారె సమర్పిస్తున్న మహిళలు





కైకలూరు రామలింగేశ్వరస్వామివారికి సారె తెస్తున్న మహిళలు

చాట్రాయి, జూలై 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగొలనుపేటలోని శ్రీలక్ష్మమ్మ, అంకమ్మ వార్లు శుక్రవారం శాకంబరీ అలంకరణలో దర్శనం ఇచ్చారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళలు ఆషాడ సారెను తలపై పెట్టుకొని మంగళ వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించి అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ముదినేపల్లి: ముదినేపల్లి మండలం పెయ్యేరు ఏరియాలో వేంచేసి యున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం విశేష అలంకరణలు చేసి మహిళలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. పలువురు మహిళలు అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించి కుంకుమ పూజలు చేశారు. అర్చకుడు శివరామకృష్ణ శర్మ అమ్మవారికి పుష్పాలంకరణ చేసి పూజలు జరపగా ముదినేపల్లి మాజీ సర్పంచ్ పామర్తి సత్యనారాయణ దంపతులు పూజలు నిర్వహించారు. దేవపూడిలోని విజయదుర్గాదేవి అమ్మవారికి మత్తి విశ్వేశ్వరరావు, శ్రీ లక్ష్మి దంపతులు పట్టుచీరెను సమర్పించి అలంకరణ చేశారు.

కైకలూరు: కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో కొలువైయున్న శ్రీపార్వతిసమేత రామలింగేశ్వరస్వామి వారికి ఆషాడమాసం మహోత్సవాల సందర్భంగా కైకలూరుకు చెందిన వందలాదిమంది మహిళలు సారె అందజేశారు. శుక్రవారం కైకలూరు వెలమపేటకు చెందిన మహిళలు పెద్దఎత్తున సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి స్వామి వారికి విశేష పూజలను నిర్వహించారు. ఈవో శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లును నిర్వహించారు.



ఆరుగొలనుపేటలో అమ్మవార్లకు శాకాంబరి అలంకరణ